ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
రాజన్న సిరిసిల్ల
జిల్లా వార్తలు
5★★★
ఆదివారం 13 జూలై 2025



మహిళల అభివృద్ధికి 'నాబార్డ్' కృషి..

కోనరావుపేట, జూలై 12 (ఆంధ్రజ్యోతి) : మహిళల అభివృద్ధి కోసం నాబార్డ్ పనిచేస్తుందని ఏజీఎం జయప్రకాష్ అన్నారు. మండలంలోని మామిడిపల్లిలో నాబార్డ్ వ్యవస్థాపక దినోత్సవాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సంస్థ గ్రామీణ ప్రాంతాల్లో పరిశ్రమలు, వ్యవసాయానికి, చిన్నరైతుల అభివృద్ధికి దోహదపడుతుందన్నారు. అంతేకాకుండా మహిళ అభివృద్ధి కోసం సంస్థ పలు పథకాలను అందిస్తుందన్నారు. నోడల్ అధికారి కృష్ణ, ప్రాజెక్టు మేనేజర్ సలావుద్దీన్, చైర్మన్ దేవారావు, సొసైటీ అధ్యక్షుడు రాంప్రసాద్, డైరెక్టర్లు శ్రీనివాస్, సుకన్య, రాజారాం, రాకేష్, రైతులు పాల్గొన్నారు.

● చందుర్తి : చందుర్తి మండలం తిమ్మాపూర్‌లో నాబార్డ్ వ్యవస్థాపక దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నాబార్డ్ అధికారులు కెక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నాబార్డ్ అధికారులు జయప్రకాశ్, ఏజీఎం దిలీప్ చంద్ర, నోడల్ ఆఫీసర్ కృష్ణ, ప్రాజెక్ట్ మేనేజర్ సలావుద్దీన్, బోర్డ్ ఆఫ్ డైరెక్టర్లు, రైతులు, మహిళలు హాజరయ్యారు.

ప్రధానోపాధ్యాయుల పోస్టులు మంజూరు చేయాలి

- ఎస్‌జీటీలకు పదోన్నతులు కల్పించి, పెండింగ్ బిల్లులను విడుదల చేయాలి..
- టీపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు చకినాల అనిల్‌కుమార్

7

స్థానిక సంస్థల్లో బీసీల ఆధిపత్యమే



- కలిసి రానున్న బీసీ రిజర్వేషన్లు
- గత ఎన్నికల్లో జనరల్ స్థానాల్లో 41మంది బీసీ అభ్యర్థుల గెలుపు
- ఈసారి 42 శాతం రిజర్వేషన్ల దిశగా ప్రభుత్వం
- గ్రామాల్లో మొదలైన ఎన్నికల హడావుడి

(ఆంధ్రజ్యోతి, సిరిసిల్ల)

స్థానిక సంస్థల ఎన్నికల్లో కలిసిరానున్న రిజర్వేషన్లతో జిల్లాలో బీసీల ఆధిపత్యం పెరుగుతుందని భావిస్తున్నారు. హామీని నిలబెట్టుకునే దిశగా కాంగ్రెస్ అధికారంలోకి రాగానే బీసీ రిజర్వేషన్లపై దృష్టి పెట్టింది. కుల గణనంలో బీసీ జనాభా లెక్కలు తీర్చడంతో పాటు స్థానిక సంస్థల్లో 42 శాతం బీసీలకు రిజర్వేషన్ల అమలుచేసే విధంగా కీలక నిర్ణయాలు చేసింది. రిజర్వేషన్ల పరిమితిపై ఉన్న సీలింగ్‌ను తొలగించడం ద్వారా ఆర్డినెన్స్ జారీ చేసి స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లను ఖరారు చేయనున్నది. సోమవారం వరకు గవర్నర్ ఆమోదం వచ్చే అవకాశాలు ఉన్నట్లు భావిస్తున్నారు. దీంతో రాజన్న సిరిసిల్ల జిల్లాలో రిజర్వేషన్ల ఖరారుపై ఆసక్తి మొదలైంది. దృష్టి సారించిన ఆశావహులు ఎన్నికల రంగంలోకి దూకడానికి సిద్ధమవుతున్నారు. బీసీల్లో మాత్రం 42 శాతం రిజర్వేషన్లతో పాటు జనరల్ స్థానాల్లో కూడా బీసీలు ఉనికిని చాటుకునే దిశగా సిద్ధమవుతున్నారు. జిల్లాలో జనరల్ స్థానాల్లో బీసీలు అధిక సీట్లలో గెలుపొందారు. గత ఎన్నికల్లో పరిషత్, గ్రామపంచాయతీలో జనరల్ స్థానల్లో 41 మంది బీసీలు గెలుపొందారు. అదే సంప్రదాయం ఈసారి కూడా కొనసాగుతుందని భావిస్తున్నారు. మరోవైపు ఇటీవల బీసీల్లో కనిపిస్తున్న చైతన్యం స్థానిక సంస్థల్లో చూపబోతున్నారనే చర్చ కూడా కొనసాగుతోంది.

రిజర్వేషన్లపై ఉత్కంఠ..

స్థానికల్లో ముందుగా జిల్లా పరిషత్, మండల పరిషత్ రిజర్వేషన్ల ప్రక్రియ పూర్తిచేసి, అదే క్రమంలో పంచాయతీలకు రిజర్వేషన్లు ఖరారు చేస్తారని భావిస్తున్నారు. 42 శాతం బీసీలకు, 15 ఎస్సీలకు, 7 శాతం ఎస్టీలతో పాటు అన్ని కేటగిరీలో మహిళలకు 50 శాతం రిజర్వేషన్లను స్థానిక ఎన్నికలలో అమలు చేయడానికి ప్రభుత్వం ఆర్డినెన్స్ విడుదలైన వెంటనే పంచాయతీరాజ్ కమిషనర్ ద్వారా రిజర్వేషన్ల కోటా ఉత్తర్వులు రావడంతోనే కలెక్టర్ ఆర్డీవోల నేతృత్వంలో రిజర్వేషన్లు ఖరారు చేయనున్నారు. జిల్లా పరిషత్ చైర్మన్లకు రాష్ట్ర యూనిట్‌గా, ఎంపీపీ పదవులకు జిల్లా యూనిట్‌గా, ఎంపీటీసీలు, సర్పంచ్‌లకు సంబంధించి మండల యూనిట్‌గా గ్రామ పంచాయతీ వార్డు సభ్యులకు గ్రామ యూనిట్‌గా రిజర్వేషన్లు నిర్ణయించనున్నారు. ఈ నెలాఖరులోగా రిజర్వేషన్ల ప్రక్రియ పూర్తిచేసే దిశగా ప్రక్రియ మొదలైంది. దీని ప్రకారం సెప్టెంబర్‌లోపు పరిషత్, గ్రామ పంచాయతీ ఎన్నికలు పూర్తి అవుతాయని భావిస్తున్నారు

పెరుతున్న అవకాశాలు..

బీసీలు జనాభా ఎక్కువగా ఉన్నా రాజకీయంగా వెనకబడుతున్న నేపథ్యంలో 1986లో అప్పటి ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు తొలిసారిగా బీసీలకు స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు అమల్లోకి తెచ్చారు. బీసీ రిజర్వేషన్లతో రాజకీయ చైతన్యంగా నాయకుల ఎదుగుదలకు తోడ్పడింది. ఎంపీటీసీ, జడ్పీటీసీ మున్సిపల్ ఎన్నికల్లో 20 శాతం బీసీలకు రిజర్వేషన్లు కేటాయించారు. ఆ తరువాత బీసీ సంఘాలు రిజర్వేషన్ల పెంపు కోసం పోరాటాలు చేయడంతో 1993లో అప్పటి ముఖ్యమంత్రి కోట్ల విజయభాస్కర్‌రెడ్డి బీసీల రిజర్వేషన్ 34 శాతానికి తెచ్చారు. సుప్రీం కోర్టు రిజర్వేషన్లు మొత్తం 50 శాతం దాటకూడదని పరిమితి విధించడంతో 2019లో బీఆర్‌ఎస్ ప్రభుత్వం రిజర్వేషన్లను 22 శాతానికి కుదించి ఎన్నికలు నిర్వహించింది. బీసీలకు అన్యాయం జరిగినా జనరల్ స్థానాల్లో సత్తా చాటారు. ఈ క్రమంలో శాసనసభ ఎన్నికల సమయంలో రేవంత్‌రెడ్డి కాంగ్రెస్ అధికారంలోకి వస్తే బీసీలకు 42 శాతం సీట్లు కేటాయిస్తామని మిగతా 8వపేజీలో

రాజన్నను దర్శించుకున్న హైకోర్టు లీగల్ సర్వీస్ అథారిటీ మెంబర్ సెక్రెటరీ



పంచాక్షరిని రాజన్న కండువాతో సన్మానిస్తున్న ఏఈవో అశోక్

వేములవాడ కల్చరల్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వర స్వామిని హైకోర్టు లీగల్ సర్వీస్ అథారిటీ మెంబర్ సెక్రెటరీ సీహెచ్ పంచాక్షరి శనివారం దర్శించుకున్నారు. కుటుంబ సభ్యులతో కలిసి రాజన్న దర్శనానికి వచ్చిన ఆయనకు ఆలయ అర్చకులు స్వస్తి వచనాలతో ఆహ్వానం పలికారు. ఈ సందర్భంగా రాజన్న ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి కోడెమొక్కు చెల్లించుకున్నారు. ఆలయ నాగిరెడ్డి మండపంలో అర్చకులు ఆశీర్వచనాలు గావించగా ఆలయ ఏఈవో అశోక్ శ్రీస్వామి వారి శేషవస్త్రాలతో సన్మానించి రాజన్న ప్రసాదాన్ని అందజేశారు. వారి వెంట వేములవాడ సీనియర్ సివిల్‌జడ్జి అజయ్ కుమార్ జాదవ్, జూనియర్ సివిల్ జడ్జి అర్ర ప్రవీణ్ కుమార్ తదితరులు ఉన్నారు.

మండల లీగల్ సర్వీస్ అథారిటీ ఏర్పాటు చేయాలి..

వేములవాడ శ్రీరాజరాజేశ్వరస్వామి ఆలయానికి వచ్చిన రాష్ట్ర లీగల్ సర్వీసెస్ అథారిటీ మెంబర్ సెక్రటరీ సీహెచ్ పంచాక్షరికి బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వినతిపత్రాన్ని అందజేశారు. మండల లీగల్ సర్వీసెస్ అథారిటీ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని వినతిపత్రంలో పేర్కొన్నాట్లు తెలిపారు. ఈసందర్భంగా లీగల్ సర్వీసెస్ అథారిటీ ఏర్పాటుకు సానకులంగా స్పందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గుండ రవి, ప్రధాన కార్యదర్శి గడ్డం సత్యనారాయణ రెడ్డి, ఉపాధ్యాక్షుడు కటుకం జనార్ధన్, బొజ్జ నరేష్ తదితరులు ఉన్నారు.

అక్రమ కట్టడంపై కలెక్టర్ కొరడా..

కోనరావుపేట,జూలై 12 (ఆంధ్రజ్యోతి): కొనరావుపేట మండలం రామన్నపేట గ్రామంలో అనుమతి లేకుండా బిల్డింగ్ కట్టడంపై వచ్చిన ఫిర్యాదు మేరకు కలెక్టర్ కూల్చివేయాలని ఆదేశాలు ఇచ్చారు. దీంతో ఇంటి యజమాని శనివారం అనుమతి లేకుండా కట్టిన బిల్డింగ్ స్లాబ్ కూల్చేశారు. కోనరావుపేట మండలం రామన్నపేట గ్రామానికి చెందిన పండగ ఆంజనేయులు అనే వ్యక్తి అక్రమ ఇల్లు కట్టడని గ్రామస్థులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేయగా వెంటనే ఆయన అక్రమ నిర్మాణం కూల్చివేయాలని అధికారులకు ఆదేశించారు. దీంతో ఇంటి యజమాని స్వయంగా కూల్చివేత పనులు చేస్తున్నారు.

అక్రమంగా మట్టి తరలింపు..



మట్టిని తరలిస్తున్న ట్రాక్టర్లు

చందుర్తి, జూలై 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తిమ్మాపూన్-నర్సింగాపూర్ గ్రామాల్లో యథేచ్ఛగా మట్టి దందా సాగుతోంది. శనివారం తిమ్మాపూర్, నర్సింగాపూర్ గ్రామాల శివారు ప్రభుత్వ భూముల నుంచి ఏలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా అనంతపల్లి గ్రామానికి 10ట్రాక్టర్లలో అక్రమంగా తరలించి కొందరు సొమ్ము చేసుకుంటున్నారు. మటిని నూతన గృహ నిర్మాణాలకు తరలిస్తూ వేలాది రూపాయలను సొమ్ము చేసుకుంటున్నారు. ప్రభుత్వ కార్యాలయాలకు సెలవు రోజుల్లో మట్టిరాయుల్లు అక్రమంగా మట్టి తరలింపు పాల్పడుతున్నారని గ్రామస్థులు పేర్కొంటున్నారు. అధికారులకు ఫోన్ చేసి చెప్పినప్పటికి పట్టించుకున్న దాఖలాలు లేవని పలువురు గ్రామ యువకులు తెలిపారు. గ్రామానికి చెందిన కొందరు యంత్రాల సాయంతో ట్రాక్టర్లలో మట్టిని తరలిస్తున్నారు. మట్టిని తరలించాలంచే సంబంధిత అధికారులకు ట్రాక్టర్ల, యంత్రాల నంబర్లను నమోదు చేయాలి. కాని ఇందుకు విరుద్ధంగా అనుమతులు లేకుండానే ప్రభుత్వ భూముల నుంచి, ఎల్లంపల్లి కాల్వల నుండి మట్టిని అక్రమంగా తవ్వి వ్యాపారం చేస్తూ ప్రభుత్వ ఆదాయనికి గండికొడున్నారనే ఆరోపణలున్నాయి. అధికారులు చూసి చూడనట్లు వ్యవహరించడంపై పలు అనుమానాలకు తావిస్తోంది. ఇప్పటికైనా రెవెన్యూ, నీటిపారురల శాఖ అధికారులకు మట్టి దందాను అడ్డుకునేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

ఉత్సాహంగా ఫ్రెండ్లీ క్రికెట్ మ్యాచ్

- ప్రారంభించిన ఎస్పీ మహేశ్ బి. గీతే



పోలీస్ ఏ జట్టుకు కప్ అందజేస్తున్న ఎస్పీ

సిరిసిల్ల క్రైం, జూలై 12(ఆంధ్రజ్యోతి): పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఫ్రెండ్లీ క్రికెట్ మ్యాచ్ ఉత్సాహంగా సాగింది. సిరిసిల్ల పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో శనివారం ప్రెస్ వర్సెస్ పోలీస్ ఫ్రెండ్లీ క్రికెట్ మ్యాచ్‌ను ఎస్పీ మహేశ్ బిగీతే ప్రారంభించారు. అనంతరం క్రీడాకారులతో ఎస్పీ పరిచయం చేసుకున్నారు. ఈ సందర్భంగా మొదటగా పోలీస్ ఏ టీం వర్సెస్ సిరిసిల్ల ప్రెస్ మధ్య సాగిన క్రికెట్ మ్యాచ్‌లో పోలీస్ ఏ టీం గెలుపొందింది. రెండో మ్యాచ్‌లో పోలీస్ బి టీం వర్సెస్ వేములవాడ ప్రెస్ టీం మధ్యసాగిన క్రికెట్ మ్యాచ్‌లో వేములవాడ ప్రెస్ టీం విజయం సాధించింది. ఫైనల్ మ్యాచ్‌లో పోలీస్ ఏ టీం వర్సెస్ వేములవాడ ప్రెస్ టీం తలపడగా వేములవాడ ప్రెస్ జట్టు విజయవం సాధించింది. దీంతో పోలీస్ ఏ జట్టు ప్రథమ, వేములవాడ ప్రెస్ జట్టు ద్వితీయ, సిరిసిల్ల ప్రెస్ జట్టు తృతీయ స్థానం కైవసం చేసుకుంది. విజేతలకు ఎస్పీ బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మహేశ్ బి. గీతే మాట్లాడుతూ క్రీడలు మానసికోల్లాసాన్ని పెంపొందిస్తాయన్నారు. నిత్యం బిజీగా ఉండే పోలీసులు, జర్నలిస్టులు ఆహ్లాదం కోసం పోటీపడడం అభినందనీయమన్నారు. పాత్రికేయులు,పోలీసుల మధ్య సత్సంబంధాలు పెరగడానికి ఫ్రెండ్లీ క్రికెట్ మ్యాచ్ ఏర్పాటుచేశామన్నారు. తద్వారా ప్రతిఒక్కరికి ఆటవిడుపుతో పాటు టీంస్పిరిట్ వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సిరిసిల్ల, వేములవాడ టౌన్ సీఐలు కృష్ణ, వీరప్రసాద్, రూరల్ సీఐలు శ్రీనివాస్, మొగిలి, చందుర్తి సీఐ వెంకటేశ్వర్లు, ఎల్లారెడ్డిపేట సీఐ శ్రీనివాస్, ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు ఆకుల జయంత్‌కుమార్, పుట్టపాక లక్ష్మణ్, ఎస్ఐలు, పాత్రికేయులు, పోలీసులు పాల్గొన్నారు.

అధికారులు బాధ్యతగా పనిచేయాలి

- కాంగ్రెస్ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి



భూమి పూజ చేస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

వీర్నపల్లి, జూలై 12 (ఆంధ్రజ్యోతి): అధికారులు బాధ్యతగా పనిచేయాలని కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల నియోజకవర్గ ఇంచార్జి కేకే మహేందర్‌రెడ్డి అన్నారు. వీర్నపల్లి మండల కేంద్రంలో నూతన పోలీస్‌స్టేషన్ భవన నిర్మాణానికి కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, ఎస్పీ మహేశ్ బి గీతేతో కలిసి శనివారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మారుమూల మండలాన్ని అభివృద్ధి దిశలో మరింత ముందుకు తీసుకెళ్లడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. అబివృద్ధికి ఇది అంతం కాదు ఆరంభం మాత్రమేనన్నారు. సమస్యను గుర్తించేది కమ్యూనిస్టులైతే ఆ సమస్యకు పరిష్కారం చూపేది కాంగ్రెస్ ప్రభుత్వం అన్నారు. మారుమూల అటవీ మండలంలో సంవత్సరంలోగా ప్రభుత్వ కార్యాలయాలకు పక్కా భవనాలను ప్రభుత్వం నుంచి మంజూరు చేపించేలా కృషి చేస్తామన్నారు. గిరిజనులకు వైద్యపరమైన ఇబ్బందులు రావద్దని ఆరుపడకల పీహెచ్‌సీని అందుబాటులో ఉంచామన్నారు. పేద ప్రజలకు భూ పంపిణీ, ఇందిరమ్మ ఇండ్లు అందించిన ఘనత కాంగ్రెస్‌దే అన్నారు.

సమస్యలు లేకుండా చూస్తాం..

మారుమూల అటవీ ప్రాంతమైన వీర్నపల్లిలో ప్రజలకు సమస్యలు లేకుండా చూస్తామని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అన్నారు. అన్ని విభాగాల్లో అభివృద్ధి కోసం ప్రత్యేక నిధులు ఇస్తున్నామని పేర్కొన్నారు. ఎల్లారెడ్డిపేట నుంచి వీర్నపల్లి వరకు ప్రధాన రహదారిపై నిర్మించిన వంతెనల వద్ద అప్రోచ్ రోడ్లను వెంటనే పూర్తిచేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

మోడల్ పోలీస్ స్టేషన్ నిర్మిస్తాం..

ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఉండేలా మండలంలో నూతన పోలీస్‌స్టేషన్‌ను నిర్మిస్తామని ఎస్పీ మహేశ్ బి గీతే అన్నారు. శాంతిభద్రతల కోసం ప్రజలు పోలీసులకు సహకరించాలన్నారు. రంగంపేట గ్రామంలో నాటి అన్నల చెరువును జిల్లా కలెక్టర్‌తో కలిసి పరిశీలించారు. దాని వివరాలను స్థానికులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి, జిల్లా యువజన క్రీడల అధికారి అజ్మీర రాందాస్, ఏఎంసీ చైర్మన్ రాములు నాయక్, వైస్ చైర్మన్ లక్ష్మణ్, సెస్ డైరెక్టర్ మల్లేశం, సీఐ శ్రీనివాస్ గౌడ్, ఎస్ఐలు లక్ష్మణ్, ఎల్లయ్య గౌడ్, రమాకాంత్, రాహుల్ రెడ్డి, ఎమ్మార్వో ముక్తార్ పాషా, ఎంపీడీవో అబ్దుల్ వాజీద్, ఏపీవో శ్రీహరి, ఏపీఎం నర్సయ్య, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సయ్య, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు తిరుపతి పటేల్, వీర్నపల్లి, ఎల్లారెడ్డిపేట మండల అధ్యక్షులు శ్రీనివాస్, లక్ష్మారెడ్డి, బీజేపి మండల అధ్యక్షుడు లక్పతి నాయక్, ప్రజా సంఘాల నాయకుడు అరుణ్ కుమార్, హ్యూమన్ రైట్స్ మండల కన్వీనర్ ప్రకాష్, ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

బీజేపీ, బీఆర్‌ఎస్ పార్టీలది కపట ప్రేమ..

- కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల నియోజకవర్గం ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి



మాట్లాడుతున్న కేకే మహేందర్‌రెడ్డి

సిరిసిల్ల టౌన్, జూలై 12 (ఆంధ్రజ్యోతి) : బీజేపీ, బీఆర్‌ఎస్ పార్టీలు బీసీలపై బడుగుబలహీన వర్గాలపైన కపట ప్రేమను చూపుతున్నాయని కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల నియోజకవర్గం ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి అన్నారు. శనివారం రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని శివనగర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయలో విలేకరులల సమావేశంలో కేకే మహేందర్‌రెడ్డి మాట్లాడారు. సామాజిక సాధికారత వైపు అడుగులు వేస్తూ బీసీల ఆత్మగౌరవాన్ని నిలబెడుతూ ఎన్నికల ముందు ఇచ్చిన హామీ ప్రకారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రాష్ట్రంలో కులగణను చేపట్టారన్నారు. చిత్తశుద్ధితో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అసెంబ్లీలో తీర్మానం చేసి పార్లమెంట్‌లో ఆమోదం కోసం పంపించారన్నారు. దేశంలో బీసీలకు బీజేపీ ద్వారానే న్యాయం జరుగతుందని ప్రధాన మంత్రి మోదీ చెప్పారని, కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ రాష్ట్ర ప్రభుత్వం పార్లమెంట్‌కు పంపించిన కులగణనపై ఒక్కసారి కూడా మాట్లాడలేదని ఆరోపించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి బీసీలపై చిత్తశుద్ధి లేదని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మరోసారి ముందుకు వచ్చి క్యాబినెట్ సమావేశంలో తీర్మానం చేసి స్థానిక సంస్థలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని గవర్నర్ ద్వారా ఆర్డినెన్స్ ఇవ్వడానికి అడుగులు వేస్తుందన్నారు. ఆర్డినెన్స్ రాగానే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించడానికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ఈ సమావేశంలో సిరిసిల్ల మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ వెల్ముల తిరుపతిరెడ్డి, డైరెక్టర్ వెంకటేశం, కాంగ్రెస్ సిరిసిల్ల పట్టణ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాష్, ఉపాధ్యక్షుడు బొప్ప దేవయ్య, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సూర దేవరాజు, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఆకునూరి బాలరాజు, చేనేత సెల్ జిల్లా అధ్యక్షుడు గోనె ఎల్లప్ప తదితరులు పాల్గొన్నారు.

జంపన్న చెరువును సందర్శించిన కలెక్టర్, ఎస్పీ



జంపన్న చెరువును సందర్శించిన కలెక్టర్, ఎస్పీ

వీర్నపల్లి, జూలై 12 (ఆంధ్రజ్యోతి): వీర్నపల్లి మండలం రంగంపేట గ్రామశివారులోని అటవీ ప్రాంతంలో నాటి నక్సల్స్ కాలంలో నిర్మించిన జంపన్న చెరువును కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా, ఎస్పీ మహేశ్ బి గీతే శనివారం సందర్శించారు. మండలంలోని అభివృద్ధి కార్యక్రమాలలో పాల్గొన్న అనంతరం చెరువును కలియ తిరిగి హోటల్ వద్ద టీ తాగుతూ.. మిర్చీలు తింటూ.. సరదాగా కాసేపు గడిపారు. కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్ రెడ్డి, స్థానిక ప్రజాప్రతినిధులతో మండల సమస్యలపై ముచ్చటించారు. చెరువును పర్యాటక కేంద్రం తరహాలో అభివృద్ధి చేయడానికి వారితో చర్చించారు. మారుమూల అటవీ ప్రాంతంలో వీక్షించే స్థలాలు అందంగా ఉంటాయని వారు పేర్కొన్నారు.

విద్యార్థులకు ప్రతిభా పురస్కారాల ప్రదానం



విద్యార్థులకు నగదు పురస్కారం అందిస్తున్న పోపా సభ్యులు

సిరిసిల్ల రూరల్, జూలై 12 (ఆంధ్రజ్యోతి) : ప్రతిభావంతులైన విద్యార్థుల ఉన్నత చదువుకోసం పద్మశాలి అఫిషియల్స్ ప్రొఫెషనల్స్ అసోషియేషన్ (పోపా) చేయూత నిస్తుందని టెక్స్‌టైల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ గుడూరి ప్రవీణ్ కుమార్, వైద్యులు డాక్టర్ గూడూరి రవీందర్, డాక్టర్ గీతావాణి, మండల విద్యాధికారులు దూస రఘుపతి, కృష్ణహరి, మాజీ పిన్సిపాల్ గాజుల ప్రతాప్, మచ్చ అనంద్, న్యాయవాది గెంట్యాల భూమేష్, మామిడాల భూపతిలు అన్నారు. సిరిసిల్ల పద్మశాలి కల్యాణ మండపంలో పద్మశాలి అఫిషియల్స్ ప్రొఫెషనల్స్ అసోషియేషన్ ఆధ్వర్యంలో శనివారం ప్రతిభావంతులైన విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలను ప్రదానం చేశారు. అలాగే ఇంటర్మీడియేట్, ఎంసెట్, ఇంజనీరింగ్ వంటి కోర్సుల్లో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు నగదు బహుమతులు, ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలను అందజేశారు. అలాగే పోపా సేవల్లో ప్రత్యక్ష భాగస్వాములను, ఆర్థిక విరాళాలు అందించిన దాతలను సన్మానించారు. అనంతరం జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ పద్మశాలి సామాజిక వర్గంలో ప్రతిభకు కొదవ లేదని పేదరికం పెద్ద చదువులకు అటంకం కాకూడదని ఉన్నత చదువులకు ప్రోత్సాహం అందిస్తున్నామన్నారు. ప్రతి వేసవిలో విద్యార్థుల శ్రేయస్సు కోసం పాలిసెట్, స్పోకెన్ ఇంగ్లీష్ ఉచిత శిక్షణలతో పాటు కార్మిక ప్రాంతాల్లో ఆరోగ్య, వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నామని అన్నారు. అవార్డులు అందుకున్న విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్ణయించుకుని రాజీలేని కృషితో జీవితంలో రాణించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పోపా ప్రతినిధులు దేవత ప్రభాకర్, చేరాల ప్రభాకర్, బైరి ప్రభాకర్, అడెపు వేణు, మోర దామోదర్, అంకారపు జ్ఞానోభా, వాసాల హరిప్రసాద్, గడ్డం సత్యనారాయణ, శ్రీపతి భూమేష్, గుండెల్లి రవి, ద్యావనపల్లి పరమేశ్వర్, బండారి శ్రీనివాస్ విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వయస్సు దాటిపోతోంది..

- కడవెరుగు రాజ్‌కుమార్, జమ్మికుంట



మల్టీపర్పస్ హెల్త్ అసిస్టెంట్ కోర్సు పూర్తి చేసి 15ఏళ్లు అవుతోంది. దీని ద్వారా ఉద్యోగం వస్తుందని శిక్షణ పొంది తెలంగాణ పారా మెడికల్ బోర్డులో పేరు నమోదు చేసుకున్నాను. ఉద్యోగానికి వయస్సు దాటిపోతోంది. ప్రభుత్వం నోటిఫికేషన్ మాత్రం ఇవ్వడం లేదు.

పురుషులకు అవకాశం ఇవ్వాలి..

- కోడెం శంకర్, నిరుద్యోగి, జమ్మికుంట



ఎంపీహెచ్‌ఏ కోర్సు చేసిన మహిళలతో సమానంగా పురుష ఆరోగ్యకార్యకర్త పోస్టులు భర్తీ చేయాలి. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో మల్టీపర్పస్ హెల్త్ వర్కర్ (మహిళలు), ఎంపీహెచ్‌ఏ కార్యకర్త (పురుషులు) కూడా ఉండాల్సి ఉంటుంది.

- దారి చూపని ఎంపీహెచ్‌ఏ(ఎం) కోర్సు
- నియామకాలు మరిచిన ప్రభుత్వాలు
- ఉద్యోగం కోసం ఎదురు చూస్తున్న నిరుద్యోగులు



ఉపాధి కోర్సుతో ప్రయోజనమేది?

ఇల్లందకుంట, జూలై 12 (ఆంధ్రజ్యోతి): వైద్య ఆరోగ్యశాఖలో వృత్తి నైపుణ్య శిక్షణ పొందిన మల్టీపర్పస్ హెల్త్‌అసిస్టెంట్ (పురుషులు) (ఎంపీహెచ్‌ఏ-ఎం)లకు ప్రభుత్వం మొండి చేయి చూపిస్తోంది. 20 ఏళ్లుగా నియామకాలు చేపట్టకుండా ఆ కోర్సునే అపహాస్యం చేస్తోంది. ఉపాధి ఉద్యోగ అవకాశాలు దక్కుతాయనే భరోసాతో లక్షలాది రూపాయలు వెచ్చించి ఎంపీహెచ్‌ఏ (ఎం) బహుళ ప్రయోజక సహాయకులుగా శిక్షణ పొందారు. విధిలేని పరిస్థితుల్లో ప్రైవేట్ సంస్థల్లో పని చేస్తూ శ్రమదోపిడీకి గురవుతున్నారు. ఉద్యోగాల భర్తీని మరిచిన వైద్యఆరోగ్యశాఖ తీరుపై శిక్షణ పొందిన ఎంపీహెచ్‌ఏ(ఎం) నిరుద్యోగులు మండిపడుతున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా డిప్లొమా ఇన్ మల్టీపర్పస్ హెల్త్‌అసిస్టెంట్ (పురుషులు) కోర్సు పూర్తిచేసిన వారు 15 వేల నుంచి 20 వేల మంది ఉన్నట్లు సమాచారం. 2002నుంచి ఇప్పటి వరకు ఎంపీహెచ్‌ఏ(ఎం) ఆరోగ్య కార్యకర్తల ఉద్యోగాలను భర్తీ చేయలేదు. ప్రతిఏటా పారా మెడికల్ కళాశాలలో ఎంపీహెచ్‌ఏ(ఎం) కోర్సును పూర్తిచేసిన అభ్యర్థులు మాత్రం నిరుద్యోగులుగానే మిగులుతున్నారు. ఎంపీహెచ్‌ఏ(ఎం) కోర్సుతో ఉద్యోగ అవకాశాలు లేనప్పుడు ఈ కోర్సును ప్రవేశపెట్టడం దేనికని నిరుద్యోగులు ప్రశ్నిస్తున్నారు. ఎంపీహెచ్‌ఏ(ఎం) కోర్సు పూర్తిచేసిన వారితో మున్సిపాలిటీలో శానిటరీ ఇన్‌స్పెక్టర్, ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల్లో హెల్త్ ఎడ్యుకేటర్, రాష్ట్రవ్యాప్తంగా ఉన్న సీహెచ్‌సీ, జిల్లాకేంద్రాల్లో ఎంఎన్‌వో అధికారిగా ఉద్యోగాల్లో నియమించే అవకాశం ఉంటుంది. ఈ పోస్టులో రాష్ట్రప్రభుత్వం మహిళా ఆరోగ్య కార్యకర్తలను మాత్రమే భర్తీ చేస్తోంది. వారితో సమానంగా పురుష ఆరోగ్య కార్యకర్తల పోస్టులు భర్తీ చేయాల్సి ఉంటుంది. ఈ కోర్సు పూర్తి చేసిన నిరుద్యోగుల వయస్సు 50 ఏళ్లు దాటిపోతోంది. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఎంపీహెచ్‌ఏ(ఎం) కోర్సులు భర్తీ చేస్తారని ఎదురుచూశారు. వారి ఆశలు అడియాశలు అయ్యాయి. గత ప్రభుత్వం ఎంపీహెచ్‌ఏ(ఎం) కోర్సులు చేసిన వారితో ఉద్యోగాలు భర్తీ చేయలేదు. ప్రస్తుత ప్రభుత్వం కూడా తమను పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులను, ప్రజాప్రతినిధులను కలిసినా ప్రయోజనం లేకుండా పోతోంది. ఉద్యోగాల అర్హతకు వయస్సు దాటకముందే రాష్ట్రంలో ఖాళీగా ఉన్న శానిటరీ ఇన్‌స్పెక్టర్స్, పీహెచ్‌సీలో పురుష ఆరోగ్య కార్యకర్తల పోస్టులకు నోటిఫికేషన్ ఇచ్చి తమ కుటుంబాలు రోడ్డున పడకుండా కాపాడాలని కోరుతున్నారు. లేకపోతే ఎంపీహెచ్‌ఏ(ఎం) నిరుద్యోగుల సంక్షేమసంఘం ఆధ్వర్యంలో ఉద్యమం తప్పదని హెచ్చరిస్తున్నారు.

లక్షలాది రూపాయలు పెట్టి కోర్సు చేశాను..

- రవికిషన్, ఎంపీహెచ్‌ఏ (ఎం) నిరుద్యోగి, కరీంనగర్



ఎంపీహెచ్‌ఏ(ఎం) కోర్సును లక్షలాది రూపాయలు ఖర్చు చేసి పారామెడికల్ కళాశాలలో శిక్షణ పూర్తి చేశాను. కానీ ప్రభుత్వాలు ఈ నియామకాలు చేపట్టకపోవడం వల్ల నిరుద్యోగులుగానే మిగిలిపోతున్నాం. వెంటనే రాష్ట్రప్రభుత్వం ఆరోగ్యశాఖలో ఎంపీహెచ్‌ఏ(ఎం) కోర్సులు పూర్తి చేసిన వారితో ఉద్యోగాలు భర్తీ చేయాలి.

నోటిఫికేషన్ కోసం ఎదురు చూస్తున్నాం..

- పెండం శ్రీనివాస్, జమ్మికుంట



మల్టీపర్పస్ హెల్త్ అసిస్టెంట్ (ఎం) కార్యకర్తల పోస్టుల ఉద్యోగాల భర్తీ కోసం ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్నాం. ప్రభుత్వాలు మారినా మా తలరాతలు మారడం లేదు. ఉద్యోగ నోటిఫికేషన్ రానట్లయితే ఈ సర్టిఫికేట్ దేనికి పని చేస్తోంది.

మానసిక వేదనతో ఒకరి బలవన్మరణం

గంగాధర, జూలై 12 (ఆంధ్రజ్యోతి): మానసిక వేదనతో ఒకరు ఆత్మ చేసుకున్నట్లు ఎస్సై వంశీకృష్ణ తెలిపారు. ఆయనవివరాల ప్రకారం.. గంగాధర మండలం వెంకంపల్లి గ్రామపరిధిలోని పిట్టలపల్లికి చెందిన పిట్టల రవి(50) ముప్పైఏళ్లుగా విదేశాలకు వెళ్లాడు. ఎనిమిదినెలల క్రితం స్వగ్రామానికి వచ్చి వ్యవసాయం చేసుకుంటున్నాడు. రవిపేరున ఉన్న భూమిని రిజిస్ట్రేషన్ చేయాలని కొడుకు, కోడలు శారీరకంగా, మానసికంగా వేధించారు. ఈనెల11న భూమిని వారి పేరున రిజిస్ట్రేషన్ చేశాడు. అయినా ఇల్లు కట్టుకునేందుకు డబ్బులు తీసుకురావాలని రవిని దుర్భాషలాడతూ చేయి చేసుకున్నారు. దీంతో విసిగిపోయిన రవి ఈనెల12న పొలంవద్దకు పోతున్నానని భార్యకు చెప్పివెళ్లాడు. ఎంతసేపటికీ రవి ఇంటికిరాకపోవడంతో మధురానగర్‌లో ఉన్న అల్లుడుకి చెప్పగా అతడు వెళ్లేసరికి చెట్టుకు ఉరి వేసుకుని చనిపోయాడు. మృతుడు రవి భార్య జమున ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

జగిత్యాల క్రైం, జూలై 12 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు భవనం మొదటి అంతస్తు పైనుంచిపడి చికిత్స పొందుతున్న మహిళ శుక్రవారం అర్ధరాత్రి మృతిచెందింది. జిల్లాకేంద్రంలోని విజయపురికాలనీకి చెందిన అంకం కృష్ణవేణి(28) గతనెల 3వతేదీన ఇల్లు మారే సమయంలో ప్రమాదవశాత్తు మొదటిఅంతస్తు నుంచి కిందపడిపోయి తీవ్రగాయాలపాలైంది. అదేరోజు కుటుంబసభ్యులు ఆమెను ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్సకోసం హైదరాబాద్‌లోని నిమ్స్‌కుతరలించారు. అక్కడ చికిత్సపొందుతూ శుక్రవారం అర్ధరాత్రి మృతిచెందింది. మృతురాలి భర్త తిరుపతి ఫిర్యాదుమేరకు కేసునమోదుచేసి దర్యాప్తుచేస్తున్నట్లుపోలీసులు పేర్కొన్నారు.

గాయపడిన వ్యక్తి మృతి



భాషామీయా(ఫైల్)

తంగళ్లపల్లి, జూలై 12 (ఆంధ్రజ్యోతి): తంగళ్లపల్లి మండలకేంద్రానికి చెందిన భాషామీయా (56) హైదరాబాద్ గాంధీఆసుపత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారంరాత్రి మృతిచెందాడు. ఈనెల2వతేదిన భాషామియాను గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు, కుటుంబసభ్యులు అతన్ని సిరిసిల్ల ప్రభుత్వఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో హైదరాబార్‌లోని గాంధీ ఆసుపత్రికి తరలించారు. చికిత్సపొందుతూ శుక్రవారం అర్ధరాత్రి మృతిచెందాడు.

అప్పుల బాధతో ఆత్మహత్యాయత్నం

- చికిత్స పొందుతూ మృతి

ఎల్లారెడ్డిపేట, జూలై 12 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలో అద్దెకు ఉంటున్న ఆంధ్రప్రదేశ్‌లోని ప్రకాశంజిల్లా దర్శి మండలం రాజంపల్లికి చెందిన భవన నిర్మాణ కార్మికుడు ఏసుబాబు(48) అప్పుల బాధతో ఈనెల 9న పురుగుల మందు తాగాడు. పరిస్థితి విషమంగా మారడంతో కుటుంబ సభ్యులు స్వగ్రామానికి తరలించారు. మూడురోజులుగా అక్కడి ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్సపొందుతూ శనివారంమృతిచెందాడని కుటుంబ సభ్యులు, బంధువులు తెలిపారు. మృతుడికి భార్య, కొడుకు, కూతురు ఉన్నారు.

ఆన్‌లైన్ బెట్టింగ్ కోసం దొంగతనం

- పోలీసులకు పట్టుబడ్డ యువకుడు



యువకుడిని అరెస్టు చూపుతున్న పోలీసులు

చొప్పదండి, జూలై 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాగంపేటకు చెందిన ఒక యువకుడు ఆన్‌లైన్ గేమ్స్, బెట్టింగ్‌కు అలవాటుపడ్డాడు. చేతిలో ఉన్న డబ్బులు మొత్తం బెట్టింగ్, గేమ్స్‌లో పోగొట్టుకున్నాడు. మళ్లీ ఆన్‌లైన్ గేమ్స్ ఆడేందుకు డబ్బుల కోసం దొంగతనం చేశాడు. చివరకు కటకటాల పాలయ్యాడు. ఎస్సై నరేష్ రెడ్డి కథనం ప్రకారం.. మండలంలోని రాగంపేటకు చెందిన కొలిపాక మధు కుమార్(20) చెడువ్యసనాలకు బానిసయ్యాడు. సులభంగా డబ్బు సంపాదించా లనే కోరికతో ఆన్‌లైన్‌లో బెట్టింగ్ యాప్స్‌కు డబ్బు సరిపోకపోవడంతో దొంగత నానికి పాల్పడ్డాడు. రాగంపేట గ్రామంలోని కొమురయ్య ఇంటిలో ఈనెల8న పట్టపగలు ఎవరూలేని సమయంలో ఇంటి లోపలికి వెళ్లి తాళం వేసి ఉన్న బీరువాను పగలగొట్టాడు. అందులోని తులం బంగారం, 22వేల రూపాయల నగదు ఎత్తుకుపోయాడు. ఫిర్యాదు రాగానే దర్యాప్తును ప్రారంభించినట్లు ఎస్‌ఐ తెలిపారు. సీసీ కెమెరాల సాయంతో దొంగతనం చేసిన మధుకుమార్‌ను గుర్తించి అరెస్టు చేసినట్లు తెలిపారు. యువకుడి నుంచి బంగారం, డబ్బులు రికవరీ చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. కాగా దొంగతనం కేసును చేధించిన ఎస్‌ఐ నరేష్‌రెడ్డి, ఏఎస్‌ఐసమ్మయ్య, పోలీసుసిబ్బంది అనిల్‌కుమార్, బి శ్రీధర్, ఎండీ ఖలీఫాను సీఐ ప్రదీప్‌కుమార్ అభినందించారు.

జ్యువెలరీ షాప్‌లో దొంగతనం

- బంగారం, వెండీ చోరీ

జమ్మికుంట, జూలై 12 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట పట్టణంలోని ధనాల కొండయ్య కాంప్లెక్స్‌లోని ఓ నగల దుకాణంలో గుర్తుతెలియని వ్యక్తులు బంగారం, వెండి దొంగతనం చేశారు. కమలాపూర్ మండలం మర్రిపల్లి గూడేం గ్రామానికి చెందిన భోగివంశీకృష్ణ శుక్రవారం సాయంత్రం జ్యువెలరీ షాప్ మూసివేసి వెళ్లాడు. శనివారం ఉదయం పక్కషాపు యాజమాని మీ షాప్ షట్టర్ పగలగొట్టి ఉందని తెలిపాడు. దీంతో వంశీకృష్ణ షాప్‌వద్దకు చేరుకోని చూడగా రెండు తులాల బంగారం, రెండు కిలోల వెండి వస్తువులు దొంగలు ఎత్తికెళ్లినట్టు గుర్తించాడు. వెంటనే పోలీసులకు సమాచారం అందిచగా పట్టణ సీఐ రామకృష్ణ సంఘటన స్థలాన్ని పరిశీలించారు. క్లూస్‌టీంతో వేలిముద్రలు సేకరించి సీసీటీవీ ఫుటేజీలు పరిశీలించారు. షాపు యాజమాని వంశీకృష్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

హత్య కేసులో నిందితుల అరెస్ట్



నిందితులను అరెస్ట్ చూపుతున్న సీఐ రాంనర్సింహారెడి

ధర్మపురి, జూలై 12 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి మండలంలోని దొనూర్ గ్రామంలో ఈనెల 10న జరిగిన హత్య కేసులో నిందితులను శనివారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ధర్మపురి సీఐ ఎ రాంనర్సింహారెడ్డి తెలిపారు. స్థానిక పోలీస్‌సర్కిల్ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అరెస్ట్ వివరాలు ఆయన వెల్లడించారు. మండ లంలోని దొనూర్ గ్రామానికి చెందిన గొల్లెన రవి(45), గొల్లెన నాగరాజు పక్కపక్కనే నివాసం ఉంటారు. ఐదేళ్లుగా వీరి మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో రవి నూతనంగా ఇళ్లు నిర్మిస్తుండగా స్థలం హద్దు విషయంలో వాగ్వాదం చోటుచేసుకుంది. దీంతో ఆగ్రహం చెందిన నాగరాజు అతని తల్లిదండ్రులు అమ్మక్క, బక్కయ్య ప్రోత్సాహంతో ఇంటి నుంచి కత్తి తీసుకొని గొల్లెన రవి కడుపులో పొడిచాడు. గమనించిన రవి కొడుకు విష్ణు అడ్డుకోబోగా అతనిపై కూడా దాడి చేయడంతో గాయాలు అయ్యాయి. తీవ్రంగా గాయపడిన రవిని హుటాహుటిన జగిత్యాల ఏరియా ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరిం చారు. మృతుడి భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపగా గొల్లెన నాగరాజు, అమ్మక్క, బక్కయ్యను శనివారం అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. సమావేశంలో ధర్మపురి ఎస్‌ఐలు పులిచెర్ల ఉదయ్‌కుమార్, ఎస్‌ఐ2 రవికుమార్ పాల్గొన్నారు.

ప్రమాదకరంగా వ్యవసాయ బావులు



శ్రీరాములపేటలో రోడ్డు పక్కనే పొదల మాటున్న ఉన్న వ్యవసాయ బావి

వీణవంక, జూలై 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కరీంనగర్ జమ్మికుంట రహదారిపై రోడ్డుపక్కనే వ్యవసాయ బావులు ప్రమాదకరంగా ఉన్నాయి. వీణవంక నుంచి మానకొండూరు వరకు రోడ్డు విస్తరణ చేపట్టిన కాంట్రాక్టర్ వ్యవసాయ బావులవద్ద రక్షణగోడ నిర్మించలేదు. కనీసం హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయలేదు. మండలంలోని వల్భాపూర్‌నుంచి మామిడాలపల్లి వరకు రోడ్డుపక్కనే దాదాపు 12 వ్యవసాయ బావులు ఉన్నాయి. మామిడాలపల్లి, కొర్కల్, చల్లూరు, శ్రీరాములపేట, కిష్టంపేట, రెడ్డిపల్లి గ్రామాల్లో రోడ్డుపక్కనే కేవలం ముళ్లపొదల అడ్డుతోనే ఈ బావులు ఉన్నాయి. ఇప్పటికైనా ఆర్‌అండ్‌బీ అధికారులు రోడ్డుపక్కన వ్యవసాయ బావులను గుర్తించి రక్షణ గోడలు నిర్మించాలని, హెచ్చరికబోర్డు ఏర్పాటు చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.

అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే సమాచారం ఇవ్వండి



కాలనీవాసులతో మాట్లాడుతున్న సీఐ ఇంద్రసేనారెడ్డి

కోల్‌సిటీ, జూలై 12 (ఆంధ్రజ్యోతి): కాలనీల్లో అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని గోదావరిఖని వన్‌టౌన్ సీఐ ఇంద్రసేనారెడ్డి పేర్కొన్నారు. శనివారం సాయంత్రం గంగానగర్‌లో డిస్ట్రిక్ట్ గార్డ్స్, సివిల్ పోలీసులతో కలిసి ఇంటింటా తనిఖీ చేశారు. దొంగతనాలు, గంజాయి, సైబర్ క్రైమ్, సీసీ కెమెరాలు, ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ ఎవరైనా ఇళ్లలో కిరాయికి వస్తే వారి పూర్తి వివరాలు తెలుసుకోవాలన్నారు. గతంలో ఎక్కడి నుంచి వచ్చారు, ఆధార్‌కార్డులు, ఉద్యోగం, కుటుంబసభ్యుల వివరాలు తెలుసుకున్న తరువాతే కిరాయికి ఇవ్వాలన్నారు. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన వారిపట్ల అప్రమత్తతో ఉండాలన్నారు. కొందరు సామగ్రి అమ్మకాల పేర పగటిపూట కాలనీల్లో తిరిగి తాళం వేసి ఉన్న ఇళ్లను టార్గెట్‌గా చేసుకుని రాత్రిపూట దొంగతనాలకు పాల్పడుతారన్నారు. ప్రతిఒక్కరూ ఇంటికి రెండు సీసీకెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. గంజాయి రవాణా, విక్రయాలు, గంజాయి సేవించే వారిపై కూడా కేసులు నమోదు చేస్తామన్నారు. సైబర్ నేరాలపై అవగాహన పెంపొందించుకోవడం ద్వారానే వాటి బారిన పడకుండా ఉంటారన్నారు. తల్లిదండ్రులు మైనర్లకు వాహనాలు ఇవ్వవద్దని, వాహనాలు ఇస్తే యజమానులపై కేసులు నమోదు చేస్తామన్నారు. ప్రతిఒక్కరూ ట్రాఫిక్‌రూల్స్, రోడ్ సేఫ్టీ నిబంధనలు పాటించాలని, యువత డ్రైవింగ్ లైసెన్స్ తీసుకోవాలన్నారు. పిల్లలు ఏం చేస్తున్నారనే విషయంపై వారి తల్లిదండ్రులు అప్రమత్తతో ఉండాలని సీఐ సూచించారు. ఈ తనిఖీలో ఎస్‌ఐలు భూమేష్, అనూష, సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్‌ఎఫ్‌సీఎల్ టౌన్‌షిప్‌లో చోరీకి యత్నం

కోల్‌సిటీ, జూలై 12 (ఆంధ్రజ్యోతి): ఆర్‌ఎఫ్‌సీఎల్ టౌన్‌షిప్‌లో శుక్రవారం అర్ధరాత్రి దొంగలు చోరీకి యత్నించారు. టౌన్‌షిప్‌లోకి చొరబడిన ఐదుగురు దొంగలు ముఖాలకు క్లాత్ కట్టుకుని చోరీకి యత్నించారు. బీ టైపు క్వార్టర్లు, అధికారుల నివాసాలలో చోరీకి యత్నించారు. మొత్తం ఐదు ఇళ్లలో చోరీకి ప్రయత్నాలు జరిగాయి. ఒక అధికారిని మెటర్నిటీలీవులో వెళ్లగా ఆ ఇంటితాళం పగులగొట్టి సామగ్రిని చిందర వందర చేశారు. కొన్ని క్వార్టర్లకు రెండువైపులా ద్వారాలు ఉండగా ఒకవైపు ద్వారాలకు తాళం వేసి మరోకవైపే వాడుకుంటారు. ఒక అధికారి ఇంట్లో ఎవరూ లేరనే భావంతో తాళం పగులగొట్టగా, లోపల ఉన్నవారు అలర్ట్ అయి, సెక్యూరిటీకి సమాచారం ఇచ్చారు. దీంతో దొంగలు పారిపోయారు. అదే సమయంలో పోలీస్‌పెట్రోలింగ్ వాహనం రావడంతో వారు కొద్దిసేపు దొంగల కోసం గాలించారు. పదిరోజుల క్రితం తాళంవేసి ఉన్న ఆరు క్వార్టర్లలో చోరీకి యత్నాలు జరిగాయి. మళ్లీ అదేతరహాలో చోరీకి యత్నించడంతో కుటుంబాలు ఆందోళన గురవుతున్నాయి. చోరీకి వచ్చిన దొంగలకు సంబంధించి కదలికలు సీసీ కెమెరాలో రికార్డు అయ్యాయి. వీరు స్థానికులు కాదని, ఇతర రాష్ట్రాలకు చెందిన వారుగా భావిస్తున్నారు.



సీసీ కెమెరాలో రికార్డు అయిన దొంగ కదలికలు

జోరుగా గుట్కా వ్యాపారం

- ప్రతీ నెల కోటి రూపాయల అక్రమ దందా
- పట్టించుకోని అధికారులు



వీణవంక, జూలై 12 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం గుట్కా, పొగాకు ఉత్పత్తులను నిషేధించినా మండలంలో యథేచ్ఛగా విక్రయిస్తున్నారు. జమ్మికుంట, వీణవంకకు చెందిన కొంతమంది వ్యాపారులు గుట్కా మాఫియాగా ఏర్పడి విచ్చలవిడిగా నిషేధిత గుట్కావ్యాపారం చేస్తున్నారు. ప్రతి నెల దాదాపు కోటి రూపాయల నిషేధిత గుట్కాను కిరణా, పాన్‌షాపులలో విక్రయిన్నారు. ప్రజల ఆరోగ్యాలతో చెలగాటం ఆడుతున్నారు. మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల నుంచి హోల్‌సెల్‌గా తీసుకువచ్చి విక్రయిస్తున్నారు. పట్టించుకోవాల్సిన అధికారులు అడపాదడపా కేసులు పెడుతూ నామమాత్ర చర్యలు తీసుకుంటున్నారు. పలుమార్లు కేసులలో దొరికినా చట్టాలలోని లొసుగులతో తప్పించుకొని అడ్డూఅదుపులేకుండా అమ్మకాలు సాగిస్తున్నారు. ఉన్నతాధికారులు గుట్కా అమ్ముతున్న వారిపై కఠినచర్యలు తీసుకోవా లని, రాష్ట్రంలోకి వచ్చే మూలాలపై నిఘా పెట్టి అమ్మకాలను నిరోధించాలని ప్రజలు కోరుతున్నారు.

అధిక ధరలకు విక్రయాలు..

నిషేధాన్ని ఆసరగా చేసుకొని ఐదు రూపాయల గుట్కాను పదిహేను రూపాయలకు విక్రయిస్తున్నారు. గుట్కా మాఫియా కొందరు అధికారులకు లక్షల్లో నెలవారీ మాముళ్లు ముట్టజెప్పి వ్యాపారం కొనసాగిస్తున్నట్లు సమాచారం. వీరు రాజకీయ నాయకుల అండదండలతోనే వ్యాపారం చేస్తున్నారన్న ఆరోపణలున్నాయి. గ్రామాల్లో గుట్కాప్యాకెట్లను 20నుంచి40కి విక్రయిస్తుండగా దొరకడమే మహాభాగ్యం అన్నట్లు వినియోగదారులు కొనుగోలు చేస్తున్నారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

కరీంనగర్‌క్రైం, జూలై 12 (ఆంధ్రజ్యోతి): సుల్తానాబాద్ మండలం గొల్లపల్లి శివారులోని వాగునుంచి అనుమతి లేకుండా ఇసుక రవాణా చేస్తున్న రెండు ట్రాక్టర్లను శనివారం పట్టుకున్నట్లు కరీంనగర్ రూరల్ సీఐ తెలిపారు. ట్రాక్టర్ యజమానులు గొల్లపల్లికి చెందిన ఎలవేని అనిల్, బోనగిరి శ్రీధర్‌పై కేసునమోదు చేసినట్లు పేర్కొన్నారు. గతంలో ఇసుక అక్రమరవాణాకు పాల్పడిన కేసులో చేగుర్తికి చెందిన కోటగిరి శ్రీనివాస్‌గౌడ్‌ను తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్లు తెలిపారు.

మట్టి తరలిస్తున్న వాహనాల పట్టివేత

ఇల్లంతకుంట, జూలై 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గాలిపెల్లి సమీపంలోని కెనాల్ దగ్గర నుంచి మట్టిని తరలిస్తున్న వాహనాలను పోలీసులు పట్టుకున్నారు. అనుమతులు లేకుండా మట్టిని తరలిస్తున్నారనే సమాచారం మేరకు శనివారం దాడిచేసి నాలుగుట్రాక్టర్లు, ఎక్స్‌కవేటర్‌ను స్వాధీనం చేసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

అదుపు తప్పి కారు బోల్తా

చందుర్తి, జూలై 12 (ఆంధ్రజ్యోతి): చందుర్తి మండలం నర్సింగాపూర్ గ్రామశివా రులో శనివారం రాత్రి కారు అదుపు తప్పి బోల్తాపడింది. గ్రామస్థుల కథనం ప్రకారం గ్రామానికి చెందిన మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చింతపంటి రామస్వామి పనిపై వేములవాడ వెళ్లితిరిగి గ్రామానికి వస్తూండగా కారు అదుపుతప్పి బోల్తా పడినట్లు తెలిపారు. కారులో ప్రయాణిస్తున్న పెరికశ్రీనివాస్, చింతకుంట బాబయ్య స్వల్పగాయాలతో పడినట్లు తెలిపారు.

వృద్ధుడిని కరిచిన కుక్క

గంగాధర, జూలై 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లక్ష్మీదేవిపల్లిలో ఒకరిని కుక్కకాటు వేసింది. గ్రామానికి చెందిన మరాటి లింగయ్య(60) సైకిల్‌పై ఊర్లోకి వెళ్లాడు. ఈక్రమంలో ఓ కుక్క సైకిల్‌పై వెళుతున్న లింగయ్య కాలిపై రెండుచోట్ల దాడిచేసి గాయపర్చింది. కుటుంబసభ్యులు లింగయ్యను ఆస్పత్రికి తరలించారు.

అవగాహన ఏది?

- జాతీయ కుటుంబ ప్రయోజన పథకానికి తగ్గిన దరఖాస్తులు
- రూ.20వేల ఆర్థిక సాయం

కరీంనగర్ రూరల్, జూలై 12 (ఆంధ్రజ్యోతి) నిరుపేద కుటుంబ పెద్ద మరణిస్తే ఆర్థిక సాయం అందించడానికి కేంద్ర ప్రభుత్వం ఎన్‌ఎఫ్‌బీఎస్ (జాతీయ కుటుంబ ప్రయోజన పథకం) అమలు చేస్తోంది. ఒకప్పుడు ఈ పథకం కింద వేలాది దరఖాస్తులు వచ్చేవి. అవగాహన లోపంతో ప్రస్తుతం దరఖాస్తులు పూర్తిగా తగ్గిపోయాయి. నిరుపేద కుటుంబాలకు చెందిన యజమానులు ఏటా వందల సంఖ్యలో మరణిస్తున్నా దరఖాస్తులు రావడం లేదు. ఆయా శాఖల్లో సమన్వయ లోపంతో అర్హులకు అన్యాయం జరుగుతోంది. చాలా ఏళ్లుగా ఈ పథకం కొనసాగుతున్నా ప్రజలకు తెలియడం లేదు. అవగాహన లోపంతో చాలా మంది దరఖాస్తులు ఇవ్వడం లేదు.



దారిద్ర్య రేఖకు దిగువన ఉండే కుటుంబానికి చెందిన యజమాని మృతి చెందితే జాతీయ కుటుంబ ప్రయోజన పథకంలో 20 వేల రూపాయల ఆర్థిక సాయాన్ని కేంద్రం బాధిత కుటుంబ సభ్యులకు అందిస్తుంది. కుటుంబ పెద్ద మరణించినప్పుడు తెల్ల రేషన్ కార్డు, ఆధార్ కార్డు, కులం, ఆదాయం, కుటుంబ సభ్యుల ధ్రువీకరణ పత్రం, బ్యాంక్ ఖాతా పత్రాలతో దరఖాస్తు చేసుకోవాలి. స్థానిక తహసీల్దార్ కార్యాలయాల్లో దరఖాస్తులను స్వీకరిస్తారు. మరణించిన వ్యక్తి వయస్సు 18 నుంచి 60 సంవత్సరాల మధ్య ఉండాలి. మృతి చెందినప్పటి నుంచి రెండేళ్ల వరకు ఎప్పుడైనా దరఖాస్తు అందజేసే అవకాశం ఉంది. దరఖాస్తు ఇచ్చిన తర్వాత ఆయా తహసీల్దార్ల స్థానికంగా విచారణ జరిపి ఆర్డీవో కార్యాలయానికి పంపిస్తారు. అక్కడి నుంచి కలెక్టర్‌కు, అనంతరం ప్రభుత్వానికి నివేదిస్తారు. ఈ పథకంపై అవగాహన లేకనే బాధిత కుటుంబాలు లబ్ధి పొందలేక పోతున్నాయి. ఈ పథకంపై గ్రామాల్లో అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది.

చెరువుల్లో అక్రమ తవ్వకాలు

● అనుమతులు లేకుండా మట్టి తరలింపు

సైదాపూర్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లోని చెరువులు, కుంటల్లో మట్టిని కొందరు అక్రమార్కులు మాయం చేస్తున్నారు. ఎక్స్‌కవేటర్ యజమానులు, ట్రాక్టర్ యజమానులు చెరువుల్లో మట్టిని తవ్వి అమ్ముకుని సొమ్ము చేసుకుంటున్నారు. రియల్ ఎస్టేట్ వ్యాపారులు తమ వెంచర్లలో రోడ్లు వేయడానికి, ఇటుక బట్టీల వ్యాపారులు ఇటుకలు చేసేందుకు అక్రమంగా తరలిస్తున్నారు. సెలవుదినాల్లో ఈ దందా ఎక్కువగా సాగుతోంది. కొన్నిగ్రామాల్లో స్థానికులు, మత్స్యకారులు చెరువుల్లో తవ్వకాలను అడ్డుకుంటున్నా అక్రమార్కులు పట్టించుకోవడం లేదు. అడ్డుకున్నవారిని బెదిరిస్తున్నారు. ఈ దందా బహిరంగంగా జరుగుతున్న అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. మండలం లోని ఎలబోతారం చెరువు, వెన్నంపల్లి గై చెరువు, రోకరాయికుంట, సైదాపూర్ పెద్ద చెరువు, గొడిశాల కుంట, బొమ్మకల్ చెరువు, ఎక్లాస్‌పూర్ చెరువు, రాయికల్ కుంట, దుద్దెనపల్లి చెరువుల్లో మట్టి తవ్వకాలు జరుగు తున్నాయి. అధికారులు స్పందించి మట్టితవ్వకాలను అడ్డుకోవాలని మండల ప్రజలు, మత్స్యకారులు కోరుతున్నారు.



సైదాపూర్ మండలంలోని వెన్నంపల్లి గై చెరువులో అక్రమంగా మట్టి తవ్వకాలు చేపడుతున్న ఎక్స్‌కవేటర్

భల్లూకంతో భయం..భయం..



కరీంనగర్ రేకుర్తిలోని ఓ వీధి సీసీ కెమెరాలో రికార్డ్ అయిన ఎలుగుబంటి

- రేకుర్తిలో సంచారం
- సీసీ కెమెరాల్లో రికార్డు
- ఎస్‌యూ, నర్సింహస్వామి గుట్టల మధ్య రాకపోకలు

కరీంనగర్ క్రైం, జూలై 12 (ఆంధ్రజ్యోతి): ఎలుగుబంటి సంచారంతో కరీంనగర్ శివారు ప్రాంత ప్రజలు భయాందోళనకు గురవు తున్నారు. మూడు రోజుల కిందట అర్ధరాత్రి సమయంలో రేకుర్తి కాలనీలో ఎలుగుబంటి సంచరించిన దృశ్యాలు సీసీ కెమెరాలో రికార్డవగా సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యాయి. ఏటా వానాకాలం ఎలుగుబంట్లు కరీంనగర్ పట్టణంతోపాటు శివారు ప్రాంతాల్లో కనిపించడం సాధారణంగా మారింది. స్థానిక శ్రీరాంనగర్, రేకుర్తి, లక్ష్మీపూర్, మల్కాపూర్, కిసాన్‌నగర్, బొమ్మకల్‌లో రాత్రి సమయంలో ఎలుగుబంటి సంచరించిన సందర్భాలు ఉన్నాయి. దశాబ్దాల కిందట కరీంనగర్ విద్యానగర్ ప్రాంతంలోని శాతవాహన విశ్వవిద్యాలయం, రేకుర్తిలోని లక్ష్మీ నర్సింహస్వామి గుట్టపైన ఎప్పుడూ ఎలుగుబంట్లు కనపడుతుండేవి. విశ్వవిద్యాలయా నికి 200 ఎకరాల స్థలం ఉంది. అధికభాగం గుట్టలు, గువాలు, పెద్ద పెద్ద రాళ్లు, ముళ్లపొదలు, చెట్లతో నిండి అడవిని తలపించేది. నెమళ్లు, కోతులు, అడవి పందులు, కుందేళ్లు, కొండచిలువలు, కొండ గొర్రెలతోపాటు ఎలుగుబంట్లకు స్థావరంగా ఉండేది. విశ్వవిద్యాలయం భవనాల నిర్మాణంతోపాటు విద్యార్థులు, పరిసర ప్రాంతాల ప్రజల కదలికలతో ఎలుగుబంట్ల జీవన విధానానికి ఆటంకం ఏర్పడింది. మరో వైపున రేకుర్తిలోని లక్ష్మీనర్సింహస్వామి గుట్టపై ఆలయ పనులు ప్రారంభంతో అక్కడా వాటి ఆవాసాలు ధ్వంసమై తరచూ బయటకు వస్తున్నాయి. గతంలో ఎస్‌యూ క్యాంపస్‌లో ఎలుగు బంటి తారసపడడంతో వసతి గృహంలోని విద్యార్థులు కొన్ని రోజులు ఖాళీచేసి ఇంటికి వెళ్లిపోయారు. ఎస్‌యూలోని గుట్ట వద్ద అటవీ శాఖ అధికారులు పట్టుకునేందుకు ప్రయత్నిం చినా సాధ్యం కాలేదు. పెగ్‌మార్క్స్ ఆధారంగా ఎలుగుబంటి వచ్చిన విషయాన్ని నిర్ధారించు కున్నారు.

● ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పలు సంఘటనలు

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వందల సంఖ్యలో ఉన్న ఎలుగుబంట్లు తరచూ పంటపొలాల్లోకి, జనావాసాల్లోకి చొరబడి అలజడిని సృష్టించడం, అడ్డు వచ్చినవారిపై దాడులు చేయడంతోపాటు హతమార్చిన ఘటనలున్నాయి. మరో వైపున రైతులు, ప్రజల చేతిలో అవి కూడా హతమవుతున్నాయి. రెండేళ్ల కిందట మైలారం శివారులో ఒక ఎలుగుబంటిని జిలెటిన్‌స్టిక్స్‌తో గుర్తుతెలియని వ్యక్తులు చంపేశారు. కొద్ది కాలం కిందట మల్కాపూర్ శివారులో ఒక ఎలుగుబంటి తాగునీటి కోసం వ్యవసాయ బావి వద్దకు వచ్చి విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను తాకడంతో మరణించింది.

● ప్రతిపాదనలకే పరిమితం

ఎలుగుబంట్ల సంరక్షణ కోసం అటవీశాఖ అధికారులు సైదాపూర్ మండలం ఆకునూర్, రాయికల్ పరిధిలోని 300 హెక్టార్ల విస్తీర్ణంలో ఎలుగుబంట్ల అభయారణ్యం ఏర్పాటుకు 2012లో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపింపినా ఇప్పటికీ కార్యరూపం దాల్చడం లేదు.

● గుట్టలు మాయం

సహజ వనరులకు, జీవన వైవిద్యానికి పెట్టింది పేరుగా ప్రసిద్దికెక్కిన ఉమ్మడి జిలాల్లో ప్రస్తుతం గుట్టలను కోల్పోయి వాటి స్థానంలో బొందల గడ్డలు ప్రత్యక్షమయ్యాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా గ్రానైట్, కంకర క్వారీలతో పెద్ద గుట్టలు, వృక్షాలు పూర్తిగా ధ్వంసం అవుతున్నాయి. దీంతో ఆవాసాలు కోల్పోయిన ఎలుగుబంట్లు, కోతులు, అడవిపందులు, ఇతర అటవీ జంతువులు గ్రామాల్లోకి వస్తున్నాయి.

● రక్షణ చర్యల్లో జాప్యం

జిల్లా అటవీశాఖ వద్ద రెస్క్యూటీం, ట్యాంకిలైజర్ గన్, ట్రాపర్ వెహికల్ వంటి రక్షణ పరికరాలు అందుబాటులో లేవు. కేవలం కొన్ని వలలు మాత్రమే ఉన్నాయి. వరంగల్ లేదా హైదరాబాద్ నుంచి రెస్క్యూటీం రావడానికి కనీసం 4 గంటల సమయం పడుతుంది. దీంతో అటవీ జంతువులను తక్షణమే బంధించడంలో జాప్యం జరుగుతోంది.

రెండు నెలల ముందు తేదీతో మరణ ధ్రువీకరణపత్రం

● జారీ చేసిన ఆస్పత్రి సిబ్బంది

● తండ్రి కడసారి చూపునకు కుమారుడికి ఇబ్బందులు

జగిత్యాల అర్బన్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల ప్రభుత్వ ప్రధానాసుపత్రి సిబ్బంది చేసిన తప్పిదం వల్ల విదేశాలలో ఉన్న కొడుకు తన తండ్రిని కడసారి చూసేందుకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నాడు. బాధితుల కథనం ప్రకారం.. జగిత్యాల జిల్లా కోరుట్ల పట్టణానికి చెందిన దుండిగాల నారాయణ అనారోగ్యంతో శుక్రవారం జగిత్యాల ప్రభుత్వ ఆసుపత్రిలో చేరాడు. మెరుగైన చికిత్స అందించినప్పటికీ నారాయణ మృతిచెందారు. నారాయణ కుమారుడు రఘు ఖతార్‌లో ఉండగా తండ్రి మరణ వార్తను కుటుంబ సభ్యులు తెలియజేశారు. రఘు ఇంటికి రావడానికి తండ్రి మరణ ధ్రువీకరణ పత్రం అవసరం ఉండగా కుటుంబ సభ్యులు జగిత్యాల ఆసుపత్రి సిబ్బంది ఇచ్చిన మరణ ధ్రువీకరణ పత్రాన్ని పంపించారు. అయితే నారాయణ శుక్రవారం మరణించగా ఆసుపత్రి సిబ్బంది జూలై 11న మరణించినట్లు కాకుండా 11-09-2025 రెండు నెలల ముందుగానే మరణించినట్లు మరణ ధ్రువీకరణ జారీచేశారు. రఘు తప్పుడు మరణ ధ్రువీకరణ పత్రంతో భారత్‌కు వెళ్లేందు కు ప్రయత్నించాడని ఖతార్‌లో రఘు పని చేస్తున్న కంపనీ అధికారులు అతన్ని భారత్‌కు పంపేందుకు నిరాకరించారు. ఆసుపత్రి సిబ్బంది మరో ధ్రువీకరణ పత్రం జారీ చేయడంతో రఘు రావడానికి మార్గం సుగమమైనట్లు కుటుంబీకులు తెలిపారు.

సెస్ అధికారుల నిర్లక్ష్యం

● 24 మంది కూలీలకు

త్రుటిలో తప్పిన ప్రమాదం

కోనరావుపేట జూలై 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కనగర్తి గ్రామంలో సెస్ అధికారుల నిర్లక్ష్యం కారణంగా 24 మంది వ్యవసాయ కూలీలకు తృటిలో ప్రాణాపాయం తప్పింది. కోనరావుపేట మండలం కనగర్తిలో 24 మంది వ్యవసాయ కూలీలు వరినాట్లకు వెళ్లి ఇంటికి వస్తున్నారు. ఆటోలో వస్తుండగా ట్రాక్టర్‌కు ఉన్న పైపు వేలాడుతున్న విద్యుత్ మెయిన్‌లైన్లు తగలడంతో ఆటోలో ఉన్న 24మందికి విద్యుత్ షాక్ తగిలింది. ఆటోడ్రైవర్ ఆటోను వేగంగా ముందుకు తీసుకెళ్లడంతో ప్రాణాపాయం తప్పింది. ఇదిలా ఉండగా కనగర్తి, మల్కాపేట రహదారిలో విద్యుత్ తీగలు కిందికి ఉన్నాయని రెండేళ్లుగా ఏఈకి చెబుతూనే ఉన్నారు. అయినప్పటికీ అధికారులు విద్యుత్ తీగలను సరిచేయడంలో నిర్లక్ష్యం చేస్తున్నారు. సెస్ అధికారుల నిర్లక్ష్యం కూలీల ప్రాణాల మీదకి వచ్చిందని వాపోయారు. ఇప్పటికైనా అధికారులు విద్యుత్ తీగలను సరిచేయాలని కోరు తున్నారు.

ఏసీబీకి చిక్కిన పంచాయతీ రాజ్ ఏఈ

● సీసీ పనుల బిల్లుకు లంచం డిమాండ్ ● కాంట్రాక్టర్ నుంచి రూ.90 వేలు తీసుకుంటుండగా పట్టుకున్న అధికారులు

కాల్వశ్రీరాంపూర్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): కాల్వశ్రీరాంపూర్ మండల కేంద్రంలో శనివారం కాంట్రాక్టర్ నుంచి లంచం తీసుకుంటుండగా పంచాయతీ ఏఈ జగదీష్‌ను ఏసీబీఅధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఓదెల మండలం బాయమ్మపల్లెకు చెందిన కాంట్రాక్టర్ కావేటి రాజు మండలంలోని వెన్నంపల్లి గ్రామంలో ఇటీవల రూ.15లక్షలతో నాలుగుచోట్ల సిమెంట్ రోడ్డుపనులు చేశారు. ఆ పనుల బిల్లుల కోసం ఏఈ జగదీష్ చుట్టుతిరగ్గా, ఎంతకు బిల్లులు చేయలేదు. బిల్లులు చేయాలంటే లక్ష రూపాయల కమీషన్ ఇవ్వాలని డిమాండ్‌చేశారు. ఆమేరకు అంత ఇచ్చుకోలేనని రూ.80వేలు ఇస్తానని రాజు పేర్కొన్నాడు. రూ.90 వేలు ఇస్తేనే బిల్లులు చేస్తానని చెప్పాడు. దీంతో కాంట్రాక్టర్ రాజు ఏసీబీ అధికారులను సంప్రదించాడు. ఏఈ జగదీష్‌కు రూ.90వేల నగదు ఇచ్చేందుకు అంగీకరించి శనివారం కాల్వశ్రీరాంపూర్ వెళ్లాడు. ఊరు బయట కారులో ఉన్న జగదీష్‌కు కాంట్రాక్టర్ రాజు రూ.90 వేల నగదును ఇవ్వగా, వెంటనే అక్కడే మాటు వేసి ఉన్న ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. అక్కడి నుంచి ఆయనను జిల్లా కేంద్రంలోని పంచాయతీ రాజ్ కార్యాలయానికి తరలించారు. పంచాయతీ అసిస్టెంట్ ఇంజనీర్ జగదీష్ అసలు పోస్టింగ్ ఎలిగేడు మండలం కాగా, ఆయనకు కాల్వశ్రీరాంపూర్ మండలతోపాటు ఓదెల మండలానికి అదనపు బాధ్యతలు అప్పగించారు. సదరు ఇంజనీరింగ్ అధికారి బిల్లులు చెల్లించ డంలో ప్రతిసారి కాంట్రాక్టర్లను కమీషన్ల కోసం తీవ్రంగా వేధిస్తున్నట్లు చెబుతున్నారు. సాధారణంగా ఇచ్చే కమీషన్ల కంటే మోతాదుకు మించి కమీషన్లు ఇవ్వాలని వేధించడంతో ఒక బాధితుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. సదరు ఇంజనీరింగ్ అధికారి లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. గతంలో జగదీష్ కరీంనగర్ మండలంలో ఏఈగాపనిచేసిన సమయంలో లంచం తీసుకుంటూ ఏసీబీఅధికారులకు పట్టుబడినట్లు సమాచారం. ఈ దాడుల్లో ఏసీబీ డీఎస్పీ విజయ్‌కుమార్, సీఐ కృష్ణకుమార్, హెడ్‌కానిస్టేబుల్ గంగా శివప్రసాద్ తోపాటు సిబ్బంది పాల్గొన్నారు.



పట్టుబడిన ఏఈ జగదీష్



బాధితుడు కావేటి రాజు

ఏఈ ఇంటిలో ఏసీబీ సోదాలు

కరీంనగర్ క్రైం: లంచం తీసుకుంటూ ఏసీబీకిచిక్కిన పెద్దపల్లి జిల్లా కాల్వశ్రీరాంపూర్ పంచాయతీరాజ్ శాఖ ఇన్‌చార్జి అసిస్టెంట్ ఇంజనీర్ పెండోట జగదీష్‌బాబుకు చెందిన కరీంనగర్ భాగ్యనగర్‌లోని ఇంటిలో శనివారం రాత్రి ఏసీబీ అధికా రులు సోదాలు నిర్వహించారు. కరీంనగర్ ఏసీబీ డీఎస్పీ విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో కొన్ని రికార్డులు, బ్యాంక్ పాస్‌బుక్, డాక్యుమెంట్లు స్వాధీనం చేసుకు న్నట్లు సమాచారం. ఏఈ జగదీష్‌బాబు 7సంవత్సరాల కిందట కూడా ఒకసారి ఏసీబీకి పట్టుబడినట్లు తెలి సింది. విచారణ అనంతరం ఏఈ జగదీష్ బాబును ఆదివారం కరీంనగర్ ప్రత్యేకఏసీబీ కోర్టులో హాజరు పరచనున్నట్లు తెలిపారు.

రాష్ట్రస్థాయి రజనీశ్రీ సాహిత్య పురస్కార ప్రదానం



పురస్కారం అందజేస్తున్న సభ్యులు

కరీంనగర్ కల్చరల్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి రజనీశ్రీ సాహిత్య పురస్కారాన్ని శనివారం హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో ప్రదానం చేశారు. జాతీయ సాహిత్యపరిషత్ కరీంనగర్ జిల్లాశాఖ ఏటా పురస్కారం అందజేస్తోంది. ఇందులో భాగంగా 2025సంవత్సరానికి శ్రీకాకుళంకు చెందిన మల్లారెడ్డి మురళీమోహన్ రచించిన 'నిశాచరుడి దివాస్వప్నం' కవితా సంపుటి పురస్కారానికి ఎంపికైంది. ఈసందర్భంగా రవీంద్రభారతిలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో రిటైర్డ్ ఐఏఎస్ అధికారి పార్థసారథి, ఉస్మానియా యూనివర్సిటీ తెలుగుశాఖ విశ్రాంత ఆచార్యుడు కసిరెడ్డి వెంకటరెడ్డి, పురస్కారప్రదాత, మహాత్మాజ్యోతీబాపూలే రెసిడెన్షియల్‌పాఠశాలల సంయుక్తకార్యదర్శి జీవీ శ్యాంప్రసాద్‌లాల్, భాషా సాంస్కృతికశాఖ సంచాలకుడు మామిడి హరికృష్ణ, దైవజ్ఞశర్మ, జాసాప రాష్ట్రఅధ్యక్షుడు వడ్లూరి ఆంజనేయ రాజు, కవిసా అధ్యక్షుడు పొన్నం రవిచంద్ర చేతుల మీదుగా రచయిత పురస్కారం అందుకున్నారు. అనంతరం కేఎస్ అనంతా చార్య పుస్తక పరిచయం చేశారు. సంస్థ అధ్యక్షుడు గాజుల రవీందర్, డాక్టర్ గండ్ర లక్ష్మణరావు, ప్రొఫెసర్ రఘు, అన్నవరం దేవేందర్, కరీంనగర్ ఆర్డీవో మహేశ్వర్, నంది శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

తెలుగు వెలుగు మహానంది పురస్కార ప్రదానం



హైదరాబాద్‌లో మహానంది పురస్కారాన్ని అందుకున్న మల్లేశం, సంతోష్‌చారీ

గంభీరావుపేట, జూలై 12 (ఆంధ్రజ్యోతి): గంభీరావుపేట మండలం నర్మాల గ్రామానికి చెందిన బొంగు మల్లేశం, మండల కేంద్రానికి చెందిన చేపూరి సంతోష్‌చారీ తెలుగు వెలుగు మహానంది పురస్కారాన్ని అందుకున్నారు. హైదరాబాద్‌లో త్యాగరాయ గానకళా నిలయంలో శనివారం తెలుగు వెలుగు జాతీయ సాహితీ వేదిక ఆధ్వర్యంలో పురస్కారాన్ని అందుకు న్నారు. యువరైతు బొంగు మల్లేశం సేంద్రియ వ్యవసాయరంగంలో కొన్ని సంవత్సరాలుగా ఆధునిక పద్ధతులతో అందరిదృష్టిని ఆకర్షించాడు. చేపూరి సంతోష్ చారీ వృత్తిపరంగా వడ్రంగి అయినా శిల్పాకళా రంగంలో రాణిస్తున్నాడు. తెలుగు వెలుగు జాతీయసంస్థ చైర్మన్ పోలోజు రాజకుమార్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ వలబోజ మోహన్‌రావు, ప్రపంచ గిన్నిస్‌బుక్ రికార్డు విజేత బ్రహ్మశ్రీ డాక్టర్ వంగాల శాంతికృష్ణ ఆచార్య, కవి పండితుడు దైవజ్ఞశర్మ చేతులమీదుగా మల్లేశం, సంతోష్‌చారీ పురస్కారాన్ని అందుకున్నారు.

ప్రధానోపాధ్యాయుల పోస్టులు మంజూరు చేయాలి

- ఎస్‌జీటీలకు పదోన్నతులు కల్పించి, పెండింగ్ బిల్లులను విడుదల చేయాలి
- టీపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు చకినాల అనిల్‌కుమార్

సిరిసిల్ల రూరల్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): ప్రాథమిక పాఠశాలల్లో ఖాళీగా ఉన్న ప్రధానోపాధ్యాయుల పోస్టులను ప్రభుత్వం వెంటనే మంజూరు చేయడంతోపాటు ఎస్‌జీటీలకు పదోన్నతులు కల్పించి పెండింగ్‌లో ఉన్న బిల్లుల చెల్లించాలని తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్(టీపీటీఎఫ్) రాష్ట్రఅధ్యక్షుడు చకినాల అనిల్‌కుమార్ డిమాండ్ చేశారు. సిరిసిల్ల పట్టణంలో శనివారం టీపీటీఎఫ్ జిల్లాఅధ్యక్షుడు దుమాల రామ్‌నాథ్‌రెడ్డి అధ్యక్షతన కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు అనిల్‌కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వం ఇదివరకే ప్రకటించిన 10వేల ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయుల పోస్టులను ఇవ్వాలన్నారు. గతప్రభుత్వం ప్రకటించిన పదివేల పోస్టులు ఇంతవరకు మంజూరు చేయలేదని, వెంటనే రాష్ట్ర ప్రభుత్వం వాటిని మంజూరుచేసి ప్రాథమిక పాఠశాలలను అభివృద్ధి చేయాలన్నారు. అదేవిధంగా బీఎడ్ అర్హత కలిగిన ఎస్‌జీటీ ఉపాధ్యాయులకు కూడా ప్రాథమికపాఠశాల ప్రధానోపాధ్యాయ పోస్టులు ఇవ్వాలన్నారు. రేషనలైజేషన్ పేరుతో ప్రాథమిక పాఠశాలలను మూసివేసేందుకు కుట్రలు జరుగుతున్నాయన్నారు. ప్రభుత్వం 20మందివిద్యార్థులకు ఒక ఉపాధ్యాయుడిని నియమించాలన్నారు. పాఠశాలలో కనీసం ఇద్దరు ఉపాధ్యాయులు ఉండే విధంగా నిబంధనలను సవరించాలన్నారు. ప్రభుత్వం పీఆర్‌సీని ప్రకటించాలని డిమాండ్ చేశారు. కేజీబీవీలో పనిచేస్తున్న ఉపాధ్యాయుల పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించాలని కోరారు. సమావేశంలో రాష్ట్రఉపాధ్యక్షుడు పాతూరి మహేందర్ రెడ్డి, జిల్లా ప్రధానకార్యదర్శి విక్కుర్తిఅంజయ్య, ఉపాధ్యక్షులు మందాడిశ్రీనివాస్‌రెడ్డి, కెవి రజనిరాణి, కార్యదర్శి మైలారం తిరుపతి, చకినాల రమచంద్రం, ఎడ్ల కృష్ణ, చైతన్యరెడ్డి, అకాడమిక్ సెల్ కన్వీనర్ బుస్స రాజేందర్, శ్రీధర్, తాటికొండ సంజీవ్, జగిత్యాల శ్రీనివాస్, కదిరే శ్రీనివాస్, బొజ్జ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు అనిల్‌కుమార్

అంగన్‌వాడీ టీచర్ మృతికి కారణమైన

యువకుడి రిమాండ్

ఎల్లారెడ్డిపేట, జూలై 12 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ టీచర్ మారోజు స్వరూప మృతికి కారకుడైన వీర్నపల్లి మండలం మద్దిమల్లతండాకు చెందిన యువకుడు కెరావత్ నరేశ్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామని ఎల్లారెడ్డిపేట రూరల్ సీఐ శ్రీనివాస్ శనివారం వెల్లడించారు. ఆయన కథనం మేరకు.. వీర్నపల్లి మండలం మద్దిమల్లకు చెందిన స్వరూప మద్దిమల్లతండాలో అంగన్‌వాడీ టీచర్‌గా విధులు నిర్వహిస్తోంది. ఈనెల 7న సాయంత్రం విధులు ముగించుకుని ఇంటికి వెళ్లేందుకు సిద్ధమైంది. అంగన్‌వాడీ కేంద్రంలో స్వరూప వద్ద చిన్నతనంలో అక్షరాలు నేర్చుకున్న మద్దిమల్లతండాకు చెందిన యువకుడు కెరావత్ నరేశ్ బైక్‌పై వెళుతున్న క్రమంలో తనను ఇంటి వద్ద దిగబెట్టమని అడిగింది. మద్యం మత్తులో ఉన్న నరేశ్ ఆమెను బండిపై ఎక్కించుకుని గ్రామం వైపు కాకుండా అటవీప్రాంతానికి తీసుకెళ్లాడు. బైక్‌పై ఆమెతో అసభ్యకరంగా ప్రవర్తించడం వల్ల భయంతో కేకలు వేసింది. వాహనం వేగం పెంచి కిందకు నెట్టేశాడు. తలకు బలమైన గాయాలవడంతో మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. నాలుగు రోజులుగా మృత్యువుతో పోరాడిన స్వరూప ఈనెల 11న మరణించింది. ఈనెల8న నరేశ్‌పై వీర్నపల్లి ఎస్ఐ లక్ష్మణ్ కేసు నమోదుచేశారు. కిడ్నాప్, లైంగికదాడి, మృతికి కారణమైన కేసులు నమోదు చేసి యువకుడు నరేశ్‌ను అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించామని సీఐ శ్రీనివాస్ వివరించారు.

ఉత్సవాలకు ముస్తాబైన మల్లన్న క్షేత్రం

పెద్దపట్నం, అగ్నిగుండ మహోత్సవాలకు ఏర్పాట్లు

ఓదెల, జూలై 12 (ఆంధ్రజ్యోతి): ఓదెల భ్రమరాంబ మల్లికార్జున స్వామి ఆలయం ఈనెల13,15 తేదీల్లో పెద్దపట్నం, అగ్నిగుండ మహోత్సవాలకు ముస్తాబైంది. ఆలయంలో ఈ నెల 13న ఆదివారం రాత్రి పెద్దపట్నం మహోత్సవాన్ని నిర్వహించనున్నట్లు ఈవో సదయ్య తెలిపారు. అలాగే రాత్రి 7గంటలకు భద్రకాళి ఆవాహన, 10గంటలనుంచి అగ్నిగుండం మహోత్సవం, పెద్దపట్నం జరగనున్నదని తెలిపారు. 14నఉదయం 5 గంటలకు అగ్నిగుండం దాటుట అనంతరం దక్షయాగ కథా శ్రవణం, గెలుపు ఉత్సవం, స్వామి వారికి మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, హారతి, మంత్రపుష్పం, తీర్థ ప్రసాద, వితరణ జరపనున్నామని తెలిపారు. ఈ బ్రహ్మోత్సవాలకు భక్తులు ఉమ్మడి కరీంనగర్ జిల్లా నుంచి పెద్ద సంఖ్యలో హాజరుకానున్నారు. ఆలయం వరకు హుజూరాబాద్, కరీంనగర్ డిపోల నుంచి బస్సులు నడవనున్నాయి. ఆలయంలో భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా, సరిపడే విధంగా సౌకర్యాల ఏర్పాట్లు చేశారు. ఆలయ పరిసరాలన్ని సుందరంగా తీర్చిదిద్దారు. వేడుకల ప్రాంగణాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఆలయం వద్ద పోలీస్ పికెట్ ఏర్పాటుచేసి పోత్కపల్లి, కాల్వశ్రీరాంపూర్ ఎస్ఐల ఆధ్వర్యంలో భద్రత బలగాలతో ప్రత్యేక ఏర్పాట్లను చేశారు.



విద్యుత్ కాంతుల వెలుగుల్లో ఓదెల భ్రమరాంబ మల్లికార్జున స్వామి ఆలయం

ఆలోచింపజేసిన 'బుద్ధుడితో నా ప్రయాణం' నాటిక



నాటికలో ఓ సన్నివేశం

కరీంనగర్ కల్చరల్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): నగరంలోని టీఎన్‌జీఓ ఫంక్షన్‌హాల్‌లో శనివారం రాత్రి అభ్యుదయ ఆర్ట్స్ అకాడమి ఆధ్వర్యంలో ప్రదర్శించిన 'బుద్ధుడితో నా ప్రయాణం' నాటిక ఆలోచింపజేసింది. ఈ సందర్భంగా సైనిక్ సమతాదళ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తాళ్ల వెంకటేశ్ మాట్లాడుతూ బుద్ధుడి జీవితం అంబేద్కర్‌పై ఎలా ప్రభావం చూపిందో నాటికలో కళ్లకు కట్టినట్లు ప్రదర్శించారన్నారు. సమాజంలోని మూఢనమ్మకాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. సమాజ చైతన్యం కోసం ఇలాంటి నాటికలు దోహదపడుతాయన్నారు. యువత, మేధావులు నాటిక స్ఫూర్తితో భావి తరాలకు మార్గనిర్దేశనం చేయాలన్నారు. కార్యక్రమంలో బీఎస్ఐ రాష్ట్ర అధ్యక్షుడు పరంధాములు, సూర్య ప్రకాశ్, మారు సునీల్, బాలాజీ గైక్వాడ్, టీఎన్‌జీవో అధ్యక్ష కార్యదర్శులు దారం శ్రీపివాస రెడ్డి, లక్ష్మణరావు, రాజేశ్, శ్రవణ్, రోహిత్, నారాయణ, దేవేందర్, భిక్షపతి, రవీందర్ పాల్గొన్నారు.

ధర్మపురి నరసింహుని క్షేత్రంలో భక్తుల రద్దీ

ధర్మపురి, జూలై 12 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రంలో శనివారం భక్తుల రద్దీ నెలకొంది. స్థానిక శ్రీ లక్ష్మీనరసింహ స్వామి, అనుబంధ ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఆషాఢ మాసం పురస్కరించుకుని ఉదయం వరకు క్షేత్రం అంతటా భక్తులతో రద్దీగా కనిపించింది. పవిత్ర గోదావరి నదిలో భక్తులు స్నానాలు ఆచరించారు. నరసింహుని ఆలయంలో భక్తులు అభిషేకాది పూజలు, కుంకుమార్చన, స్వామి వారల నిత్య కల్యాణం జరిపించి పూజలు చేశారు. శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయం ఆవరణలో గల రావి చెట్టు ఆంజనేయ స్వామి చుట్టు భక్తులు ప్రదక్షిణాలు చేశారు.. యమ ధర్మరాజు ఆలయం వద్ద గండ దీపంలో నూనె పోసి భక్తి శ్రద్ధలతో పూజలు జరిపారు. భక్తులకు ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్, ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, ధర్మకర్తలు సేవలు అందించారు.



స్వామి వారి దర్శనం చేసుకుంటున్న భక్తులు

బీసీలకు 42 శాతం రిజర్వేషన్ విప్లవాత్మక నిర్ణయం

ముస్తాబాద్, జూలై 12 (ఆంధ్రజ్యోతి) : బీసీలకు కాంగ్రెస్ ప్రభుత్వం 42 శాతం రిజర్వేషన్ కల్పించడం విప్లవాత్మకమైన నిర్ణయమని బీసీ టీచర్స్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎల్లమ్మల లక్ష్మణ్‌గౌడ్ పేర్కొన్నారు. ముస్తాబాద్‌లో శనివారం మాట్లాడుతూ బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించే నిర్ణయం తీసుకోవడం పట్ల సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. బీసీల అభివృద్ధికి ముందడుగగా చెప్పొచ్చని, బీసీలకు ఆర్థికంగా నిలదొక్కుకోవాలంటే రిజర్వేషన్ అత్యవసరమన్నారు. బీసీలు రాజ్యాధికారం పొందడం ద్వారానే ఆర్థికాభివృద్ధి చెందుతారన్నారు. బీసీ రిజర్వేషన్ పెంపు పట్ల హర్షం వ్యక్తం చేశారు.

చరిత్రాత్మక నిర్ణయం...

బోయినపల్లి, జూలై 12 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలలో 42శాతం బీసీ రిజర్వేషన్లు కల్పిస్తూ ఆర్డినెన్స్ జారీ చేయడానికి రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలపడం చరిత్రాత్మక నిర్ణయమని ఏఎంసీ చైర్మన్ బోయిని ఎల్లేష్ యాదవ్ అన్నారు. బోయినపల్లి మండల కేంద్రంలో ఆయన శనివారం విలేకరులతో మాట్లాడుతూ కేబినెట్ సమావేశంలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలుచేసిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలకు వెళతామని ప్రభుత్వం ప్రకటించడం పట్ల ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఇందుకోసం 2018లో తెచ్చిన చట్టాన్ని సవరించాలని దేశంలోనే కుల గణన చేపట్టి విజయ వంతం చేసుకొని తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదర్శంగా నిలిచాడన్నారు. ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంతోపాటు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

బీజేపీ నాయకుల అరెస్టు

ముస్తాబాద్, జూలై 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వెంకట్రావుపల్లెకు తరలేందుకు సిద్ధమైన బీజేపీ మండల అధ్యక్షుడు సొల్ల క్రాంతికుమార్‌తో పాటు పలువురి బీజేపీ నాయకులను పోలీసులు అరెస్టు చేశారు. వెంకట్రావపల్లెలో గల ప్రభుత్వ భూమి కొందరు ఆక్రమించుకున్నారని భూమిని పరిరక్షించి గత 12 సంవత్సరాల నుంచి ఐకేపీ కొనుగోలు కేంద్రానికే అప్పగించాలనే పిలుపు మేరకు స్థానికంగా సందర్శనకు వెళ్లేందుకు సిద్ధమవ్వగా నాయకులను పోలీసులు వేకువఝామునే అరెస్టు చేసి ఠాణాకు తరలించారు. ఎలాంటి గొడవలు జరుగకుండా ముందస్తుగా పోలీసు బలగాలను ఎస్సై గణేశ్ తెప్పించారు. ఈకార్యక్రమంలో బీజేపీ నాయకులు మెర్గు అంజాగౌడ్, కోల కృష్ణ, కార్తీకొరెడ్డి, చీకోటి మహేశ్, శ్రీనివాస్‌రావు వెంకటేశ్, బాధ నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

రిటైర్డ్ ఉపాధ్యాయుడికి సన్మానం

ఇల్లంతకుంట, జూలై 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఒబులాపూర్ గ్రామానికి చెందిన పదవీవిరమణ పొందిన గోపు రాజిరెడ్డి అనేఉపాధ్యాయుడిని అటవీశాఖలో పనిచేసి పదవీవిరమణ పొందిన వంతడుపుల గ్రామానికి చెందిన సామ ఎల్లారెడ్డి శనివారం సత్కరించారు. కార్యక్రమంలో రిటైర్డ్ తహసీల్దార్ సామ బాల్‌రెడ్డి, బీజేపీ మండల అధ్యక్షుడు భూమల్ల అనీల్‌కుమార్, నాయకులు దేశెట్టి శ్రీనివాస్, కొలనూరు ముత్తక్క, పెంటల వేణు, మెడకొక్కుల వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ మోడల్ హౌస్ ప్రారంభం



ఇందిరమ్మ మోడల్‌హౌస్‌ను ప్రారంభిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

వీర్నపల్లి, జూలై 12(ఆంధ్రజ్యోతి): వీర్నపల్లి మండలకేంద్రంలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మించిన ఇందిరమ్మ మోడల్ గృహ హౌస్‌ను కలెక్టర్ సందీప్ కుమార్‌ఝా, ఎస్పీ మహేశ్ బి గీతే శనివారం కాంగ్రెస్ పార్టీ నియోజక వర్గ ఇన్‌చార్జ్ కేకే మహేందర్ రెడ్డితో కలిసి ప్రారంభించారు. అనంతరం గదులను, టాయిలెట్స్‌ను వారు పరిశీలించారు. ఇందిరమ్మ గృహ నిర్మాణం బావుందని పేర్కొన్నారు. వీరివెంట హౌసింగ్ పీడీ శంకర్, మండల ప్రత్యేకాధికారి ఆఝ్మీర రాందాస్, ఏఈ చైతన్య, ప్రజాప్రతినిధులు, స్థానిక అధికారులు ఉన్నారు.

కాంగ్రెస్ నాయకుడికి పరామర్శ

ఇల్లంతకుంట, జూలై 12 (ఆంధ్రజ్యోతి) :మండలకేంద్రానికి చెందిన కాంగ్రెస్ పార్టీ మైనార్టీసెల్ మండల అధ్యక్షుడు జమాల్‌ను శనివారం నాయకులు పరామర్శించారు. జమాల్ తండ్రి నసీరొద్దీన్ అనారోగ్యంతో వారం రోజుల క్రితం మృతిచెందగా, కుటుంబీకులకు ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కోమటిరెడ్డి భాస్కర్‌రెడ్డి, నాయకులు రమణారెడ్డి, అయిలయ్య, సంజీవ్, చిట్టి ప్రదీప్‌రెడ్డి, కీసరి కనుకయ్య తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్‌తోనే సామాజిక న్యాయం



సంబరాల్లో పాల్గొన్న నాయకులు

ఎల్లారెడ్డిపేట, జూలై 12 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ పార్టీతోనే సామాజిక న్యాయం సాధ్యమని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయం తీసుకోవడం పట్ల ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో శనివారం ఆ పార్టీ నాయకులు సంబరాలు నిర్వహించారు. సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. టపాసులు పేల్చి మిఠాయిలు పంపిణీ చేసుకున్నారు. ఈ సందర్భంగా నర్సయ్య మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని అన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చుతోందని అన్నారు. కార్యక్రమంలో నాయకులు లక్ష్మారెడ్డి, గిరిధర్‌రెడ్డి, సాహెబ్, శ్రీనివాస్‌రెడ్డి, రాజేందర్, రవి, బాబు, మల్లేశం, రాములు, బుచ్చాగౌడ్, శ్రీనివాస్, రఫీక్, మల్లారెడ్డి, బాలయ్య, నారాయణరెడ్డి, విజయ్‌రెడ్డి, కిషన్, బాల్‌రెడ్డి, ఇమాం, దేవేందర్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం, ప్రభుత్వ విప్ చిత్రపటాలకు క్షీరాభిషేకం..



క్షీరాభిషేకం నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు

వేములవాడ టౌన్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్‌లు కల్పిస్తూ కాంగ్రెస్ తీసుకున్న నిర్ణయం చారిత్రాత్మకంగా నిలుస్తుందని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పిల్లి కనుకయ్య అన్నారు. వేములవాడ మున్సిపల్ పరిధిలోని నందికమాన్ వద్ద సీఎం రేవంత్‌రెడ్డి, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ చిత్రపటాలకు కాంగ్రెస్ నాయకులు క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు ఎర్రం రాజు నాయకులు కత్తి కనుకయ్య, పండుగప్రదీప్, గాలిపెల్లి స్వామి, సిలువేని మల్లేశం, వంకాయల భూమయ్య, వనపట్ల ప్రభాకర్‌రెడ్డి, రాంరెడ్డి, పర్శరాములు, రవి ఉన్నారు.

డ్రైనేజీలు లేక ఇబ్బందులు

- రోడ్డుపైనే నిలుస్తున్న మురుగునీరు



నందికమాన్ వద్ద ఆర్‌అండ్‌బీ రోడ్డుపై నిలిచిన మురుగునీరు

వేములవాడ టౌన్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): వేములవాడ మున్సిపల్ పరిధిలోని నాంపల్లి 6వ వార్డు నందికమాన్ వద్ద డ్రైనేజీ లేకపోవడంతో స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వేములవాడ రాజరాజేశ్వర స్వామి ఆలయానికి నిత్యం వేల సంఖ్యలో భక్తులు వస్తుంటారని, భక్తులకు స్వాగతం పలికే నందికమాన్ చౌరస్తా వద్ద డ్రైనేజీ లేకపోవడం ఇబ్బందికరంగా మారిందని స్థానికులు పేర్కొంటున్నారు. నందికమాన్ చౌరస్తా నుంచి సిరిసిల్ల వెళ్లే దారిలో ఎడమవైపు ఆర్‌అండ్‌బీ రోడ్డును ఆనుకుని డ్రైనేజీ నిర్మాణం చేపట్టాలని కోరుతున్నారు. వర్షంనీరు రోడ్డు మీద నిలుస్తుండటంతో వాహనదారులకు ఇబ్బందులు తలెత్తుతున్నాయని,రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని వాపోతున్నారు. ఇప్పటికైనా డ్రైనేజీ నిర్మాణం చేపట్టాలని కోరుతున్నారు.

ఫిర్యాదు చేసినా ఫలితం లేదు..

- అన్నల్‌దాస్ రమేష్



నందికమాన్ నుంచి సిరిసిల్లకు వెళ్లే ఎడమవైపు ప్రధాన రోడ్డుకు డ్రైనేజీ లేకపోవడంతో నిత్యం తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయి. సంబంధిత అధికారులు చొరవ తీసుకుని డ్రైనేజీ నిర్మాణానికి చర్యలు తీసుకోవాలి. మున్సిపల్‌లో పలుమార్లు ఫిర్యాదు చేసినా ఫలితం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తగిన చర్యలు చేపట్టాలి.

ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించాలి..

- సొర్పుల రాజయ్య



నందికమాన్ చౌరస్తా వద్ద డ్రైనేజీ లేకపోవడంతో అస్తవ్యస్తంగా మారింది. ఒక్కవైపు డ్రైనేజీ నిర్మాణం చేసిన అధికారులు మరోవైపు వేయకుండా వదిలేశారు. మున్సిపల్‌కి వెళితే తమ పరిధి కాదని ఆర్‌అండ్‌బీ అధికారులను కలవాలని చెప్పారు. ఆర్‌అండ్‌బీ అధికారులు చొరవ తీసుకుని డ్రైనేజీ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలి.

ఆషాఢ బోనాల సందడి..



సిరిసిల్లలో పోచమ్మతల్లి బోనాల మహోత్సవాల్లో విద్యార్థులు..



గంభీరావుపేటలో మహంకాళి అమ్మకు బోనాలు..

సిరిసిల్ల రూరల్, జూలై 12 (ఆంధ్రజ్యోతి) : సిరిసిల్ల పట్టణం అశోక్‌నగర్‌లోని వివేకానంద విద్యానికేతన్ హైస్కూల్‌లో శనివారం విద్యార్థులతో పోచమ్మ తల్లి బోనాల మహోత్సవాన్ని చేపట్టారు. దీనిలో భాగంగా విద్యార్థులతో బోనాలను తయారుచేయించి, వివిధ రకాల వేషధారణల్లో విద్యార్థులు వార్డులో ర్యాలీ తీయడంతోపాటు పోచమ్మ ఆలయం వరకు వెళ్లి ప్రత్యేక పూజలు చేయించారు. అనంతరం పాఠశాలలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బుచ్చారావు, మహేందర్‌రెడ్డి, ఉపాధ్యాయులు కృష్ణవేణి, రమాదేవి, దేవేంద్ర, దివ్య, రేఖ, సౌజన్య, మాధవి, అక్షయ తదితరులు పాల్గొన్నారు.

● గంభీరావుపేట : గంభీరావుపేట మండల కేంద్రంలో స్థానిక గౌడ సంఘం ఆధ్వర్యంలో శనివారం మహంకాళమ్మకు బోనాలు తీశారు. వర్షాలు సమృద్ధిగా కురువాలని, ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని మహంకాళి అమ్మవారికి బోనాలు సమర్పించారు. బోనాలు ఎత్తుకుని మహిళలు అమ్మవారి ఆలయానికి బయల్దేరి, నైవేద్యం సమర్పించారు. డప్పు చప్పుళ్ళ మధ్య మహంకాళి అమ్మవారి బోనాల ఊరేగింపు మేన్‌రోడ్, సీతారాంబజార్ వెంట సాగింది. గౌడ సంఘం పెద్దలు, చిన్నలు, మహిళలు ఆలయానికి చేరుకుని మొక్కులు చెల్లించుకున్నారు. వర్షాలు బాగా కురవాలని పాడిపంటలతో ఇంటిల్లిపాది సుఖసంతోషాలతో ఉండాలని అమ్మవారిని వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం నం(1) అధ్యక్షుడు గడ్డమీది సుమన్‌గౌడ్, గౌడ సంఘం నం (2) అధ్యక్షుడు బంగ్ల రాజుగౌడ్, సంఘ పెద్దలు సాయబుగారి లక్ష్మన్‌గౌడ్, చేరాల రాజాగౌడ్, గోపగారి లక్ష్మీనారాయణ, దమ్మన్నపేట రమేష్‌గౌడ్, శంకర్‌గౌడ్ యూత్ నాయకులు పాపగారి రాజు, కిషన్, నాగరాజు, గొల్లపల్లి నర్సింలు తదితరులు పాల్గొన్నారు. కాగా, మండల కేంద్రంలో శనివారం రెడ్డి సేవా సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మహంకాళి అమ్మవారికి బోనాలు సమర్పించారు. ఆషాడ మాసం పురస్కరించుకుని మహంకాళి అమ్మవారికి బోనాలు సమర్పించి, మొక్కులు చెల్లించుకున్నారు. పెద్దలు, మహిళలు, పిల్లలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

సన్నబియ్యం పక్కదారి..

- రేషన్ కార్డుల్లో మృతుల పేర్లు తొలగించని అధికారులు

ఎల్లారెడ్డిపేట, జూలై 12 (ఆంధ్రజ్యోతి) : నిరుపేదలకు కూడు కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వం చౌక ధరల దుకాణాల ద్వారా బియ్యం అందిస్తోంది. రేషన్ కార్డుల్లో మృతుల పేర్లను అధికారులు తొలగించకపోవడం వల్ల ఎల్లారెడ్డిపేట మండలంలో ఆత్మల పేరిట చౌక బియ్యం చేరుతోంది. పలు గ్రామాల్లో ఐదారేళ్ల కిందట చనిపోయిన వారికి బియ్యం ప్రతి నెల పంపిణీ జరుగుతోంది. అంత్యోదయ కార్డు లబ్ధిదారులు అధికంగానే ఉన్నారు. ఆత్మలకే కాదు.. శ్రీమంతులకు ప్రభుత్వం పంపిణీ చేస్తున్న బియ్యం అందుతోంది. ఫలితంగా పేదలకు దక్కాల్సిన చౌక బియ్యం అందకుండాపోతోంది.

ప్రతినెలా 300 క్వింటాళ్లు..

మండలంలో మొత్తం 29 రేషన్ దుకాణాలున్నాయి. 14929 రేషన్‌కార్డులు, 719 అంత్యోదయ కార్డులు కలిగి ఉన్నాయి. 14929 రేషన్‌కార్డుల్లో 42271 మందికి ప్రతి నెల ప్రభుత్వం 6 కిలోల బియ్యం ఉచితంగా అందజేస్తోంది. అంత్యోదయ కార్డు కలిగిన 2013 మందికి ఒక్కో కార్డుకు 35 కిలోల బియ్యం సరఫరా చేస్తోంది. మండల కేంద్రంతో పాటు రాచర్లబొప్పాపూర్, రాచర్లగొల్లపల్లి, నారాయణపూర్, అల్మాస్‌పూర్, రాజన్నపేట, వెంకటాపూర్, గుండారం, అక్కపల్లి, బండలింగంపల్లి, తదితర గ్రామాల్లో సుమారు 150 మంది చనిపోయినా నేటికి వారి పేరిట బియ్యం సరఫరా అవుతోంది. భవంతులు, కార్లు ఉన్న 1200కార్డుదారులకు ప్రతి నెల బియ్యం పంపిణీ చేస్తున్నారు. ఇలా ఆత్మలకు ప్రతి నెల 900 కిలోలు, శ్రీమంతులకు సంబంధించి ఒక్కో కుటుంబంలో నలుగురు సభ్యులుంటే వారికి 28800 కిలోలు చేరుతోంది. అంత్యోదయ కార్డుల పేరిట మరో 350 కిలోలు కలిపి మొత్తం సుమారు 300 క్వింటాళ్ల బియ్యం అందుతోంది. కార్డుల్లో మృతుల పేర్లు తొలగించకపోవడం, శ్రీమంతులకు కార్డులుండడంతో సరఫరా అయిన బియ్యాన్ని పంపిణీ చేస్తున్నామని రేషన్ డీలర్లు పేర్కొంటున్నారు. సంబంధిత శాఖ అధికారులు స్పందించి చనిపోయిన వారి పేర్లు, అనర్హుల కార్డులు తొలగిస్తే మరింత మందికి న్యాయం జరుగుతోందని పేదలు అంటున్నారు. పలు గ్రామాల్లో మృతులు, శ్రీమంతులకు అందుతున్న వివరాలు..

● మండల కేంద్రంలోని ఓ మహిళ పదేళ్ల కిందట ప్రమాదంలో మృతిచెందింది. అప్పటినుంచి నేటి వరకు ఆమె పేరిట ప్రతినెల 6 కిలోల బియ్యం ఆ కుటుంబానికి అందుతోంది.

● మండల కేంద్రంలోని ఓ వ్యాపారికి స్థానికంగా రెండు భవంతులున్నాయి. కరీంనగర్, హైదరాబాద్ పట్టణాల్లోనూ కళ్లు చెదిరే భవంతులున్నాయి. ఆయన కుటుంబంలో నలుగురు సభ్యులున్నారు. వ్యాపారి భార్య పేరిట రేషన్‌కార్డు ద్వారా ప్రతి నెల చౌక బియ్యం తీసుకుంటున్నారు.

● మండలంలోని బొప్పాపూర్‌లో ఓ మాజీ ప్రజాప్రతినిధికి రెండస్తుల భవనంఉంది. స్థానికంగా నాలుగెకరాల వ్యవసాయ పొలం ఉంది. ఆయన కుటుంబానికి ప్రతి నెల బియ్యం అందజేస్తున్నారు.

పరిశీలించి పేర్లను తొలగిస్తాం

- సుజాత, ఎల్లారెడ్డిపేట తహసీల్దార్

మండలంలోని పలు గ్రామాల్లో రేషన్ కార్డులో పేరుండి చనిపోయిన వారి వివరాలను సేకరిస్తాం. క్షేత్రస్థాయిలో విచారణ జరిపి శ్రీమంతులను గుర్తిస్తాం. మృతులు, శ్రీమంతుల వివరాలను పరిశీలించి పేర్లను తొలగిస్తాం. గ్రామాల్లో మృతిచెందిన వారి పేర్లు, అనర్హుల వివరాలను ప్రజలు తమకు అందిస్తే చర్యలు తీసుకుంటాం.

నిలిచిన తారు రోడ్డు నిర్మాణం

- ఇబ్బందులు పడుతున్న రెండు మండలాల ప్రజలు



కంకర పోసి వదిలిపెట్టిన మరిమడ్ల రహదారి

కోనరావుపేట, జూలై 12 (ఆంధ్రజ్యోతి) : తారు రోడ్డు నిర్మాణం మధ్యలోనే ఆగిపోవడంతో రెండు మండలాల వాసులు ఇబ్బందులు పడుతున్నారు. కోనరావుపేట మండలం మరిమడ్ల గ్రామం నుండి వీర్నపల్లి మండలం గర్జనపల్లి గ్రామానికి ప్రభుత్వం ఎల్లారెడ్డిపేట మండలం నుంచి మరిమడ్ల వరకు సుమారు 25 కిలో మీటర్లకు తారు రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేసింది. మరిమడ్ల నుంచి గర్జనపల్లి వరకు సుమారు రెండు కిలోమీటర్లు ఉంటుంది. గర్జనపల్లి నుంచి మరిమడ్లకు రెండు కిలోమీటర్లు ఉండగా ఒక కిలోమీటర్ తారు రోడ్డు నిర్మాణం పూర్తి చేసి మరో కిలోమీటర్ కంకర పోసి వదిలిపెట్టారు. తారు రోడ్డు నిర్మాణానికి కంకర పోసి సుమారు 20 నెలలు అవుతున్నా తారు రోడ్డు నిర్మాణం సదరు కాంట్రాక్టర్ చేపట్టకపోవడంతో రెండు మండలాల వాసులు ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మిగిలిన కిలోమీటర్ పనులు చేపట్టాలని రెండు మండలాల వాసులు కోరుతున్నారు.

రోడ్డు నిర్మాణం పూర్తి చేయాలి..

- కుమ్మరి దిలీప్ మరిమడ్ల



మరిమడ్ల నుంచి గర్జనపల్లి వరకు మిగిలిపోయిన కిలోమీటర్ తారురోడ్డు నిర్మాణం చేపట్టాలి. కంకరపోసి సుమారు రెండు సంవత్సరాలు గడుస్తున్న కిలోమీటర్ తారు రోడ్ నిర్మాణం చేపట్టడం లేదు. కంకర పోయడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయి. అధికారులు స్పందించి మిగిలిన తారు రోడ్డు నిర్మాణం చేపట్టాలి.

త్వరలో పనులు ప్రారంభిస్తాం..

- కిరణ్, ఆర్‌బీ ఏఈ, సిరిసిల్ల

మిగిలిన తారు రోడ్డు నిర్మాణం కాంట్రాక్టర్‌తో మాట్లాడి పనులు చేపడతాం. ఈ తారు రోడ్డు నిర్మాణం మరిమడ్ల వరకు లేటుగా మంజూరు కావడం వల్ల జాప్యం ఏర్పడింది. మిగిలిన కిలోమీటర్ తారు రోడ్డు నిర్మాణం చేపడతాం.

'స్థానిక' సంస్థల్లో బీసీల ఆధిపత్యమే..

(5వ పేజీ తరువాయి)

ప్రకటించారు. దానికి అనుగుణంగానే బీసీ రిజర్వేషన్లు 42 శాతం అమలుకు సిద్ధం చేశారు.

జడ్పీటీసీ, ఎంపీటీసీల్లోనూ బీసీల హవా..

జిల్లాలో 12 జడ్పీటీసీలు, 123 ఎంపీటీసీ స్థానాలు ఉన్నాయి. వీటిలో కూడా బీసీలు జనరల్ స్థానాల్లో హవా చూపారు. 12 జడ్పీటీసీ స్థానాల్లో ఆరు జనరల్ స్థానాలు, బీసీలు రెండు, ఎస్సీలు మూడు, ఎస్టీలకు ఒకటి రిజర్వ్ చేశారు. ఇందులో జనరల్ స్థానాల్లోనే ముగ్గురు గెలుపొందారు. రిజర్వేషన్‌తో కలిపి ఐదుగురు బీసీలు గెలుపొందారు. 123 ఎంపీటీసీ స్థానాల్లో జనరల్ స్థానాలు 64, బీసీలకు 25, ఎస్టీలకు 6, ఎస్సీలకు 28 స్థానాలు రిజర్వ్ చేశారు. ఇందులో జనరల్ స్థానాల్లో 17 బీసీ అభ్యర్థులు గెలుపొందారు. రిజర్వేషన్‌తో కలుపుకొని 42ఎంపీటీసీ స్థానాల్లో మెజార్టీగా ఉన్నారు. ఈసారి స్థానాలు జడ్పీటీసీ ఎంపీటీసీ పెరగలేదు. సర్పంచ్, జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలకు అధికార యంత్రాంగం చురుకుగా ఏర్పాట్లు పూర్తిచేస్తున్నారు. ఇప్పటికే జడ్పీటీసీ, ఎంపీటీసీ సంబంధించిన ఏర్పాట్లు చేయడంతో పాటు సర్పంచ్ ఎన్నికల కంటే ముందు పరిషత్ ఎన్నికలు వస్తాయని తెలుస్తోంది.

గత ఎన్నికల్లో 80 గ్రామపంచాయతీల్లో బీసీలు

రాజన్న సిరిసిల్ల జిల్లాలో ప్రస్తుతం కొత్తగా ఏర్పడిన ఐదు గ్రామపంచాయతీలతో కలిపి 260 గ్రామపంచాయతీలకు ఎన్నికల నిర్వహణకు అధికార యంత్రాంగం ఏర్పాట్లు చేస్తోంది. 2019లో ఎన్నికలు జరిగిన సమయంలో జిల్లాలో 255 గ్రామ పంచాయతీలు ఉండగా, 252 గ్రామపంచాయతీలకు ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికల్లో బీసీలకు 56స్థానాలు, ఎస్సీలకు 51, ఎస్టీలకు 30, జనరల్ స్థానాలు 115రిజర్వ్ చేశారు. ఇందులో జనరల్ స్థానాల్లో 24 మంది బీసీలు గెలుపొందారు. 252 స్థానాల్లో బీసీ రిజర్వేషన్లు కలుపుకొని 80 మంది బీసీలు గెలుపొందారు. ప్రస్తుతం జిల్లా లోని 260 గ్రామ పంచాయతీల్లో మొదటి విడతలో 137 సర్పంచ్‌లు, 1888 వార్డులు, రెండో విడతలో 123 సర్పంచ్‌లు, 1080 వార్డులకు ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నారు.

నీట్‌లో గంభీరావుపేట యువకుడి ప్రతిభ

గంభీరావుపేట, జూలై 12 (ఆంధ్రజ్యోతి) : గంభీరావుపేట మండల కేంద్రానికి చెందిన అరిగె అవినాష్ అనే యువకుడు ఇటీవల వెలువడ్డ నీట్ ఫలితాల్లో రాష్ట్ర స్థాయిలో ప్రతిభ కనబర్చాడు. అరిగె రమేష్-లత రెండవ కుమారుడైన అవినాష్ నీట్ ఫలితాల్లో 1456 ర్యాంక్ సాధించాడు. అవినాష్ నీట్ ఫలితాల్లో రాష్ట్ర స్థాయి ర్యాంక్ సాధించడంపై వారి తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేశారు. మండల ముదిరాజ్ సంఘం తరఫున అవినాష్‌ను అభినందించి, సన్మానించారు. ఈ కార్యక్రంలో రాష్ట్ర ముదిరాజ్ సంఘ నాయకులు పర్శ హన్మండ్లు, మండల ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు చాత్రబోయిన లక్ష్మన్, సంఘ నాయకులు పిట్ల బాబు, సంఘ నాయకులు పాల్గొన్నారు.

మాజీ జడ్పీటీసీ ఔదార్యం

కోనరావుపేట, జూలై 12 (ఆంధ్రజ్యోతి) : కోనరావుపేట మండలం నాగారం గ్రామానికి శనివారం కోనరావుపేట మాజీ జెడ్పిటిసి చెన్నమనేని శ్రీకుమార్ సుమారు లక్ష రూపాయల విలువగల శవపేటిక (రిఫ్రిజిరేటర్) అన్ని కుల సంఘాలు గ్రామ పెద్దల సమక్షంలో వారి అమ్మ, వదిన అయిన చెన్నమనేని పద్మావతి, చెన్నమనేని రమాదేవిల జ్ఞాపకార్థం అందజేశారు. ఈ శవ పేటిక అందజేసిన శ్రీకుమార్‌కు గ్రామ ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా శ్రీకుమార్ మాట్లాడుతూ మీ అందరి సహాయ సహకారాలతో మున్ముందు కూడా గ్రామానికి కావాల్సిన అవసరాలు తీర్చటంలో ముందు ఉంటానని, ఈ శవపేటిక చుట్టు పక్కల గ్రామాల వారు కూడా వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి, అన్ని కుల సంఘాల పెద్ద మనుషులు, నాయకులు పాల్గొన్నారు.

యాగ కరపత్రాల ఆవిష్కరణ

ముస్తాబాద్, జూలై 12 (ఆంధ్రజ్యోతి) : రాజన్న సిరిసిల్ల జిల్లా ధూపదీప నేవేద్య సంఘం తరుపున నిర్వహించే పంచ కుండాత్మాక చండీ కుబేర పాశుపత యాగ కరపత్రాలను శనివారం స్థానిక హనుమాన్ ఆలయం ఎదుట ఆవిష్కరించారు. యాగాన్ని పెద్దఎత్తున నిర్వహిస్తున్నామని భక్తులు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కేకే మహేందర్‌రెడ్డికి ఆహ్వాన పత్రికను అందించి శాలువాతో సత్కరించారు. యాగానికి రూ.20 వేలను అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు రాచర్ల పార్థసారథిశర్మ, అంజనేయ శర్మ, పంచరత్నాల మురళి చారిలున్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు ఇసుక కొరత లేదు..

- కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా - జిల్లెల్లలో 26 మంది లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందజేత



ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను అందజేస్తున్న మహేందర్‌రెడ్డి



కలెక్టర్‌కు గోడు వెళ్ల బోసుకుంటున్న జిల్లెల్ల గ్రామస్థులు

తంగళ్లపల్లి, జులై 12 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలకు ఇసుక కొరత లేదని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా స్పష్టం చేశారు. శనివారం తంగళ్లపల్లి మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో జిల్లెల్ల గ్రామానికి చెందిన 26మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలు కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహీందర్‌రెడ్డి చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లడుతూ లబ్ధిదారులు వారికి కేటాయించిన ఇళ్లలోకి వెంటనే వెళ్లాలని సూచించారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా జరిగిందని అన్నారు. పైలెట్ ప్రాజెక్టులో భాగంగా రాళ్లపేట గ్రామంలో నిర్మిస్తున్న ఇళ్లు తుది దశకు చేరుకున్నాయని వెల్లడించారు. మండలంలోని ఇందిరమ్మ ఇళ్ల పురోగతిపై పీడీ హౌసింగ్, ఎంపీడీవోలను అభినందించారు. అనంతరం కేకే మహీందర్‌రెడ్డి మాట్లడుతూ లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలలో ఇబ్బందులు పడవద్దని అన్నారు. ఏమైన ఇబ్బందులు తలెత్తితే అధికారుల దృష్టికి తీసుకుపోయి పరిష్కరించుకోవాలని సూచించారు. ఇసుక, మట్టి కొరత లేకుండా చూడాలని అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ వెలుముల స్వరూప తిరుపతిరెడ్డి, వైస్ చైర్మన్ నేరెళ్ల నర్సింగంగౌడ్, హౌసింగ్ పీడీ శంకర్, డీపీవో షర్ఫుద్దీన్, ఎంపీడీవో లక్ష్మీనారాయణలతో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు జల్గం ప్రవీణ్‌కుమార్, సత్తు శ్రీనివాస్‌రెడ్డి, పొన్నాల పర్శరాములు, ఆరెపల్లి బాలు, ఇట్టిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, పెద్దూరి తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

మట్టి కోసం ఆందోళన వద్దు..

మట్టి కోసం లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారని తమ దృష్టికి వచ్చిందని కలెక్టర్ తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు తమ గ్రామంలోని చెరువు, తమకు సంబంధించిన పొలంలో ఉన్న మట్టిని వినియోగించుకునేందుకు గ్రామ పంచాయతీ కార్యదర్శి ద్వారా తహసీల్దార్‌కు సమాచారం ఇవ్వాలని అన్నారు. తహసీల్దార్ అనుమతి తీసుకున్న తర్వాత మట్టిని గృహ నిర్మాణ అవసరాలకు వినియోగించుకునేందుకు అవకాశం ఉంటుందని స్పష్టం చేశారు.

అన్యాయం చేశారు...

గతంలో అర్హుల జాబితాలో తమ పేర్లు ఉండగా ప్రస్తుతం తమ పేర్లను తొలగించి అన్యాయం చేశారని జిల్లెల్ల చెందిన కొంతమంది ఆవేదన వ్యక్తం చేశారు. మండల పరిషత్ కార్యలయంలో ఇళ్ల మంజూరు పత్రాల పంపిణీ కొనసాగుతుండగా.. జిల్లెల్ల గ్రామానికి చెందిన కొంతమంది తమ పేర్లు తొలగించడంపై మండిపడ్డారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక సక్రమంగా జరగలేదని ఆరోపించారు.

రోడ్డు విస్తరణలో తన ఇల్లు కోల్పోతే తనకు డబుల్ బెడ్‌రూం ఇస్తామని హామీ ఇచ్చి అర్హుల జాబితాలో గతంలో ప్రకటించారని తెలిపారు. ఇప్పుడు తొలగించారని ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసులు జోక్యం చేసుకుని వారిని శాంతింప జేశారు. అలాగే జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లగా కార్యలయానికి రావాలని పరిశీలించి న్యాయం చేస్తానని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా హామీ ఇచ్చారు.